Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం, జూన్ 23, 2026 | సంపుటి - 20 | సంచిక 270 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

# భువనగిరి కోటకు పూర్వ వైభవం

**టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తాం**

**రోప్‌వే నిర్మించే అంశాన్ని పరిశీలించిన మంత్రి జూపల్లి**



యాదాద్రి భువనగిరి : చరిత్ర కలిగిన పురాతన భువనగిరి ఖిల్లాకు పూర్వ వైభవం తీసుకొస్తామని టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. దీనికి పర్యాటక శోభ కల్పిస్తామని అన్నారు. సోమ వారం ఉదయం భువనగిరి ఖిల్లా పైకి రోప్ వే నిర్మించే స్థలాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి 2లో

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం

## దేవరకద్ర డిఆర్ఎస్ ప్రాజెక్ట్ సత్వరం చేపట్టాలి

## కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌తో సిఎం రేవంత్ భేటీ

## రక్షణ భూములు కేటాయించినందుకు కృతజ్ఞతలు



న్యూఢిల్లీ : ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రాష్ట్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందని సిఎం రేంవత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమ్ఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన

తరువాయి 2లో




# ఓట్, సీట్ చోరీలో బిజెపి నిమగ్నం

**సర్ ప్రక్రియ ఓట్ల తొలగింపుకే ప్రాధాన్యం**

**ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు వంద ఖాయం**

**బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణలో టీపీసీసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

హనుమకొండ : సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు. నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగిలించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు. ఓట్ల చోరీయే కాకుండా సీట్ల చోరీకి కూడా భాజపా పాల్పడుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్‌తో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు దోపిడీ చేసి ఇప్పుడు కేటీఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ దోపిడీని ప్రజలు మరిచిపోయారనే భ్రమలో కేటీఆర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. 2లో



# చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

**ఇబ్బంది పెట్టిన ప్రతీ ఒక్కరికీ సమాధానం ఇస్తా**

**వర్ధన్నపేట కార్యకర్తల భేటీలో కెటిఆర్ ఘాటు హెచ్చరిక**

వరంగల్ : వచ్చే ఐదేళ్లు ఎవ్వరినీ మరచిపోమని, సిఎం చిట్టి నాయుడును అస్సలు వదిలిపెట్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తోపాటు నియోజకవర్గానికి చెందిన నేతలు తరువాయి 2లో

# ఆర్డీఎస్ నీటిపై రాజీలేదు



**రైతుల ప్రయోజనాలు కాపాడి తీరుతాం**

**నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష**

హైదరాబాద్ : తెలంగాణ హక్కుల పరిరక్షణెళి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోమవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుంగభద్ర డ్యామ్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. తుంగభద్ర జలాల వినియోగంపై తెలంగాణ హక్కులను బలంగా వినిపించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర నీటి పంపిణీ అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఎగువ రాష్ట్రాల చర్యల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగు అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ట్రిబ్యునల్, బోర్డులు, అంతర్రాష్ట్ర సమావేశాల్లో తెలంగాణ వాదనను బలంగా వినిపిస్తామని చెప్పారు. చట్టపం మైన, సాంకేతిక, పరిపాలనా అంశాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తరువాయి 2లో



# తెలంగాణ అభివృద్ధికి బిఆర్ఎస్ మోకాలడ్డు

**పదేళ్లలోఎ భ్రష్టు పట్టించిన నేతలే చిల్లర రాజకీయాలు**

**హరీష్ రావు, కెటిఆర్‌ల తీరుపై ఎంపి ఆగ్రహం**

**సిఎం విజన్‌తో రాష్టాభివృద్ధి చేస్తున్నారని చామల కితాబు**

యాదాద్రి భువనగిరి : తెలంగాణ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ఓ విజన్‌తో ముందుకెళ్తుంటే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జీర్ణించుకోలేకపోతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌తో విద్య, వైద్యం, రైతులకు మేలు చేయాలనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు పోతున్నారని వ్యాఖ్యానించారు. 2లో



# 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎపి

**ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా కృషి**

**ఎపి రూపురేఖలు మార్చేలా చంద్రబాబు వేగంగా అడుగులు**

**ఢిల్లీ సదస్సులో మంత్రి లోకేశ్ వెల్లడి**

న్యూఢిల్లీ : 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేష్ వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని చెప్పారు. ఢిల్లీ వేదికగా జరిగిన 'రిపబ్లిక్ టీవీ సమిట్ 2026'లో ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఫార్ములాను అందిస్తోందని పేర్కొన్నారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత వేగంగా పనులు పూర్తి కావాలని కోరుకునే ఒక 'స్పీడ్ బాస్'. ఆయన వేగానికి తగ్గట్టుగానే యంత్రాంగం పనిచేస్తోంది. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ పెట్టుబడులలో 25 శాతం వాటా ఒక్క ఆంధ ప్రదేశ్‌కే వస్తుండటం మా ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం' అని లోకేష్ గర్వంగా ప్రకటించారు.

తరువాయి 2లో

# రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు

## రాజకీయం రంగు పులుముతున్న నేతలు

## ఫేక్ ప్రచారాలపై ఉద్యోగులు అప్రమత్తం కావాలి

## ప్రజల సమస్యల పరిష్కారంలో మానవీయకోణం ముఖ్యం

## ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు హెచ్చరిక



అమరావతి : రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయని.. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్ని స్తున్నాయని సీఎం చంద్ర బాబు అన్నారు. వివిధ ఘటనలకు కులమతాల రంగు పులుముతున్నారని.. వాటిని వివాదాస్పద అంశాలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీజీఎస్‌పై సమీక్షలో భాగంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులు, అధికారులను బద్నాం చేస్తున్నారన్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు.

తరువాయి 2లో

# భువనగిరి కోటకు పూర్వ వైభవం

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫోర్ట్ రిస్టోరేషన్ చేసి చరిత్ర తెలిపేలా మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. గంటకు మూడు వందల మంది ప్రయాణికులు ఖిల్లా పైకి వెళ్లేలా రోప్ వే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట , భువనగిరి ఖిల్లా, కొలనుపాక సోమేశ్వర ఆలయం, స్వర్ణగిరి కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన టూరిజం శాఖను దేశంలో నంబర్ వన్‌గా గుర్తింపు తీసుకొస్తామని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో చారిత్రక కట్టడాలు ఉన్నాయన్నారు. వాటిని ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసి వందలాది మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. నెలకు రెండు రోజులైనా టూరిజంకు సమయం కేటాయించాలని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పర్యాటక స్థలాలకు వెళ్తే ప్రజల ఆలోచనా విధానం మారుతుందని... అనేక మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# ఆర్డీఎస్ నీటిపై రాజీలేదు

తెలంగాణ వాటా నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకునే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చిచెప్పారు. రైతుల సాగునీటి అవసరాల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్ని అయినా తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. తెలంగాణ రైతుల హక్కులు, సాగునీటి భద్రత కోసం ప్రభుత్వం అన్ని వేదికలపై పోరాడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని మర్చిపోం.. మనమీద కేసులు పెట్టినోడిని మరిచిపోం. మనతో నిలబడినోళ్లను కూడా మరిచిపోమన్నారు. తప్పకుండా చెప్తున్నా.. నేను కేసీఆర్ సారంతా మంచోన్నైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది.. పక్కా విడిచిపెట్ట. రిటైరైనా పారిపోయినా సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. ఎవడెవడైతే మా కార్యకర్తలను సతాయించిండో ఒక్కొక్కడిని వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది.. వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. ఇది నేనేం ఊరికే చెప్పడం లేదు.. గుర్తు పెట్టుకోండి. కానీ రమేశన్న (ఆరూరి రమేశ్) వీడు మంచోడేనే అన్నా అని మళ్లా వారిని తీసుకొని రావొద్దని కేటీఆర్ సూచించారు.

# బోధన్ మున్సిపాలిటీలో కౌన్సిలర్ల నిరసన

## మూడు నెలలయినా సమావేశం పెట్టనందుకు ఆవేదన

నిజామాబాద్,జూన్22 : బోధన్ పట్టణంలోని మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటై ముదు నెలలు గడుస్తున్నా సమావేశం నిర్వహించడం లేదని బోధన్ మున్సిపాలిటీలో మున్సిపల్ కౌన్సిలర్లు సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీర్ ఇలియాజ్ అలీ ఆధ్వర్యంలో ఎంఐఎం కౌన్సిలర్లు కార్యాలయం ఆవరణలో టెంట్ వేసి కుర్చీలలో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ పాలక వర్గం ఏర్పాటై మూడునెలలు పూర్తయినా నెలవారీ సమావేశాలు నిర్వహించడం లేదని మండిపడ్డారు. అంతేకాకుండా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారు కూడా స్పందించడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు విన్నవించామని ఆయన స్పందించకపోవడంతో సమస్యలు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ లో సమావేశలు నిర్వహించని కారణంగానా తామే కార్యాలయం ఆవరణలో టెంట్, కుర్చీలు వేసి అధికారులను ఆహ్వానించామన్నారు. అధికారులు ఇక్కడకు కూడా రాక పోవడంతో తమ సమస్యలతో కూడిన వినతిపత్రం ఖాళీ కుర్చీకి అందచేసి నిరసన వ్యక్తం చేశారు. అధికారుల వైఫల్యం కారణంగా సమస్యల పరిష్కారం లో వార్డుల్లో ప్రజలకు ఏం చెప్పాలో తెలియక వార్డుల్లో తిరగడం కూడా మానివేశామని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపల్ సమావేశాలు నిర్వహించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు హెచ్చరించారు.

# పిల్లకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యా యత్నం

## పిల్లలు మృతి...చావు బతుకల్లో తల్లి

ఖమ్మం,జూన్22 : స్వగ్రామానికి మకాం మార్చే విషయంలో భర్తతో ఓ భార్య పడిన ఘర్షణ చివరికి వారి పిల్లల ప్రాణాలను తీసేదాకా వెళ్లిన ఘటన ఖమ్మం జిల్లా కేంద్రంలో వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు .. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ గుర్రాలపాడుకు చెందిన బొబ్బిలి లింగరాజు, స్వాతి దంపతులు కొద్ది నెలలుగా ఖమ్మం త్రీటౌన్ గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి వేదక్‌కుమార్ (7), తనీశ్ (4) అనే కుమారులున్నారు. లింగరాజు ఓ సెల్‌ఫోన్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా షాపు నడుపలేనని, ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకోవాలని లింగరాజుకు సెల్‌ఫోన్ షాపు యజమాని చెప్పాడు. లింగరాజు ఇదే విషయాన్ని భార్యకు చెప్పాడు. స్వగ్రామానికి వెళ్లి వేరే పని చూసుకుందామని చెప్పగా భార్య స్వాతి నిరాకరించింది. ఇదే విషయమై రెండు రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్తపై కోపం పెంచుకున్న భార్య.. శనివారం లింగరాజు ఇంట్లో లేని సమయం చూసి.. బిస్కెట్లకు ఎలుకలమందు పూసి పిల్లలకు తినిపించింది. అనంతరం ఏమీ తెలియనట్టు భర్తకు ఫోన్ చేసింది. పిల్లలకు వాంతులు అవుతున్నాయని, త్వరగా ఇంటికి రావాలని చెప్పింది. దీంతో హుటాహుటిన ఓ మెడికల్ షాపునకు వెళ్లిన లింగరాజు.. వాంతులు తగ్గేందుకు ఓ సిరప్ తీసుకొని ఇంటికి వచ్చాడు. పిల్లలకు తాగించి పడుకోబెట్టాడు. విష ప్రభావంతో పెద్ద కుమారుడు వేదక్‌కుమార్ నిద్రలోనే కన్నుమూశాడు. చిన్న కుమారుడు తనీశ్‌కు ఆదివారం ఉదయం వాంతులు కావడంతో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. పిల్లల పరిస్థితి విషమిస్తున్న తరుణంలో స్వాతి సైతం ఎలుకలమందు తినడంతో స్థానికులు ఆమెను దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. ఖమ్మం త్రీటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. ఫాదర్స్‌డే రోజున ఓ తండ్రి తన పిల్లలను కోల్పోవడం విషాదాన్ని మిగిల్చింది.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హస్తిన పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామన్నారు.

# రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు

ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు అన్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పుదారి పడుతున్నారని వ్యాఖ్యానించారు. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారని, శిక్షలు కూడా పడుతున్నాయని చెప్పారు. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. తప్పుచేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడని హెచ్చరించారు. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంచ్ చేసేలోపు క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్కు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలన్నారు.పీజీఆర్ఎస్ అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదులను పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలన్నారు. వినూత్న ఆలోచనలతో పని చేసే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలతో వ్యవహరించే సమయంలో సౌమ్యంగా, మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. దీనివల్ల పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఉద్యోగులు తమ సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవాలని చెప్పారు. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనలను అదుపు చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని సీఎం పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పుదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# తెలంగాణ అభివృద్ధికి బిఆర్ఎస్ మోకాలడ్డు

సీఎం రేవంత్‌రెడ్డిపై బావ, బామ్మర్దులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం భువనగిరిలో ఎంపీ చామల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ పదేళ్లు అధికారంలో ఉండి సినిమా వాళ్లతో అంటకాగి సినిమా మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయంలో సినిమా మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజల జీవితాలు కేటీఆర్‌కు సినిమాలాగా కనపడుతున్నాయా.. అని కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన సూపర్ హిట్ అనుకుంటున్నారా...అని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో మిగులు రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన షోలే సినిమా కాదని వ్యంగ్యంగా అన్నారు. రేవంత్‌రెడ్డి రెండున్నరేళ్ల పాలన గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి క్రాప్ డైవర్షన్‌పై అవగాహన కల్పిస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పండించిన ధాన్యం అత్యధిక దిగుబడి వస్తే కేంద్రప్రభుత్వం ఎందుకు కొనట్లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారని తెలిపారు. మెట్రోఫేజ్- 2 కోసం సంప్రదింపులు చేసి ఎల్ అండ్‌టీకి ఎగ్జిట్ ఇచ్చారని.. మెట్రోఫేజ్ -2ను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని కిరణ్ కుమార్ రెడ్డి వివరించారు. మెట్రోఫేజ్-2పై బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మెట్రోఫేజ్ -2పై కిషన్ రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారని ప్రస్తావించారు. కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ ఇప్పించాలని.. కలిసి అభివృద్ధిలో ముందుకెళ్దామని సీఎం అంటున్నారని అన్నారు. కేటీఆర్ బాధ్యతతో ప్రజల కోణంలో మాట్లాడాలని హితవు పలికారు. హైడ్రా పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. హైడ్రా హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలకంగా మారిందని తెలిపారు. నాళాలు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టాలని హైడ్రా భావిస్తోందా...? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరం ముంపునకు గురికాకుండా హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. బీజేపీ ఓటు, సీటు చోరీల గురించి కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదన్ని ÷ర్ అయ్యారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై చిత్తశుద్ధి లేని మాటలు మాట్లాడుతున్నారని కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సింధుజలాలపై అవసరమైతే యుద్ధం

## భారత్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం

## పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు

ఇస్లామాబాద్ : సింధు జలాల కోసం అవసరమైతే భారత్‌తో యుద్ధం చేస్తామని పాక్ ప్రగల్భాలు పలికింది. సింధు జలాల ఒప్పందం విషయంలో వెనక్కి తగ్గేది లేదని భారత్ స్పష్టం చేసిన నేపథ్యంలో, పాకిస్థాన్ రక్షణమంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్ చర్యలు తమ నీటి సరఫరాకు ముప్పు కలిగిస్తున్నాయని, అవసరమైతే ఆ దేశంపై యుద్ధానికి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం సింధు జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదానికి పూర్తిగా, విశ్వసనీయంగా అడ్డుకట్ట వేయకపోతే ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని భారత్ తేల్చి చెప్పింది. కాగా, పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించే లేదా అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే అది జాతీయ భద్రతా సమస్యగా మారుతుందని ఆసిఫ్ అన్నారు. పాక్ ఆర్థిక వ్యవస్థ, కోట్లాది మంది ప్రజల జీవనాధారం సింధు నదీ వ్యవస్థపై ఆధారపడి ఉందని ఆసిఫ్ అన్నారు. ఈ నేపథ్యంలో నీటి హక్కులను కాపాడుకునేందుకు అన్ని మార్గాలనూ ఉపయోగిస్తామని, అవసరమైతే యుద్ధం వరకు వెళ్లడానికి కూడా వెనుకాడబోమని ఆసిఫ్ హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సింధు నదీ వ్యవస్థలోని ఆరు నదులను భారత్, పాకిస్థాన్‌కు సమానంగా కేటాయించారు. ఒప్పందం ప్రకారం రావి, బియాస్, స్లటెజ్ నదులపై భారత్‌కు హక్కులుంటాయి. సింధు, జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు హక్కులుంటాయి. అలాగే పాకిస్థాన్‌కు కేటాయించిన మూడు నదులపై కూడా భారత్‌కు కొన్ని పరిమిత హక్కులు ఉన్నాయి. పాక్‌కు కేటాయించిన నదులపై భారత్ జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చు. తాగునీరు, గృహ అవసరాలకు నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే పరిమిత స్థాయిలో సాగునీటికి కూడా ఉపయోగించు కోవచ్చు. అయితే నదుల ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునే హక్కు భారత్‌కు లేదు. ÷ాగా, ఇటీవలి ఉగ్రవాద ఘటనల తర్వాత భారత్ ఈ ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగితే పాత విధానంలో ఒప్పందం కొనసాగదని భారత్ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో చీనాబ్, జీలం నదులపై కొన్ని ప్రాజెక్టులు నిర్మిస్తోంది. ఈ నిర్మాణాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

# ఖతార్ గ్యాస్ క్షేత్రంలో భారీ పేలుడు

## 54మందికి తీవ్ర గాయాలు..18మంది ఆచూకీ గల్లంతు

ఖతార్,జూన్22 : ప్రపంచ గ్యాస్ వాణిజ్యానికి ఆయువుపట్టు వంటి ఖతార్ రస్ లఫాన్ క్షేత్రంలో బర్జాన్ ప్లాంట్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 54 మంది గాయపడగా.. 18మంది జాడ గల్లంతైంది. ఈ పేలుడుతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అలాగే ప్రాణనష్టంపై వివరాలు అందాల్సి ఉంది. వాస్తవానికి ఇరాన్-అమెరికా యుద్ధం వేళ ఐఆర్‌జీసీ దళాలు ఈ గ్యాస్ క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకొని భారీగా దాడులు చేశాయి. దీంతో గ్యాస్ ప్లాంట్ దెబ్బతిని భారీగా ఉత్పత్తి సామర్థ్యం పడిపోయింది. కొన్నాళ్ల క్రితమే ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గు ముఖం పట్టడంతో గ్యాస్ ఉత్పత్తి తిరిగి ప్రారంభించేందుకు ఖతార్ చర్యలు చేపట్టింది. ఖతార్ రాజధాని దోహాకు ఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరంలో పర్షియన్ గల్ఫ్ తీరంలో రస్ లఫాన్ నగరం ఉంది. భౌగోళికంగా వ్యూహాత్మక ప్రదేశంలో ఉండటంతో ఇది ఆసియా, ఐరోపా ఎగుమతులకు అత్యంత అనువైన ప్రదేశం. ఇక్కడి నుంచి గ్యాస్ దాదాపు 30 దేశాలకు పైగా ఎగుమతి అవుతోంది. వీటిల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన జపాన్, దక్షిణ కొరియా, భారత్, ఐరోపా సమాఖ్య, చైనా వంటి దేశాలు ఉన్నాయి. భారత ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో ఖతార్ నుంచి 40-47శాతం వరకు హర్మూజ్ జలసంధి దాటుకొని వస్తున్నాయి. ఈ గ్యాస్ క్షేత్రాన్ని ఖతార్ ఎనర్జీనే నిర్వహిస్తుంది. భారత్-ఖతార్ మధ్య 2024లో 78 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం జరిగింది. దీని ప్రకారం 2028 నుంచి 20 ఏళ్లపాటు ఏటా 7.5 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ సరఫరా చేయాల్సి ఉంటుంది. ఖతార్ ఎల్ఎన్‌జీ భారత్‌లో విద్యుత్తు, ఎరువుల ఉత్పత్తి, పరిశ్రమలు, గృహోపయోగానికి చాలా కీలకం. అమెరికా, ఆఫ్రికాతో పోల్చుకొంటే ఇక్కడి నుంచి భారత్‌కు గ్యాస్ తరలించడం చాలా చౌక.

# నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ

## మోడీ 12 పాలనపై పుస్తకాలు అందచేత

హైదరాబాద్,జూన్22 : తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సినిమాలపైనే దృష్టి సారించిన చిరంజీవిని బీజేపీ కీలక నేత కలవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే అంశంపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సంస్కరణలను వివిధ రంగాల ప్రముఖులకు వివరించే ప్రయత్నం జరుగుతోంది. అందులో భాగంగానే రామచందర్ రావు చిరంజీవిని కలిసి మోదీ ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలు, ప్రచార పత్రాలను అందజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక రంగాల్లో జరిగిన మార్పులపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అధికారికంగా ఇది మర్యాదపూర్వక భేటీగా చెబుతున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం పలు విశ్లేషణలు కొనసాగుతున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన చిరంజీవి, అనంతరం ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాల్లో బిజీ అయిన ఆయన మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి వస్తారా? అనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యంగా బీజేపీతో ఆయన సాన్నిహిత్యం పెరుగుతుందా అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. చిరంజీవి తమ్ముడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్‌కు బీజేపీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో చిరంజీవి-బీజేపీ భేటీకి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఈ సమావేశం కేవలం మర్యాదపూర్వకంగానే జరిగిందా? లేక భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు సంకేతమా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# ఓట్, సీట్ చోరీలో బిజెపి నిమగ్నం

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయమని మహేశ్ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకెళు_న్నారని.. అందుకే వాస్తవాలు చెప్పేందుకు ఇక్కడికి వచ్చామని మహేశ్ తెలిపారు. కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని నిలదీశారు. పదేళ్లలో జరిగిన దోపిడీ, అవినీతి, అక్రమాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్తుల కోసం చెల్లిని గెంటేసిన కేటీఆర్ ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆర్ఎస్ తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తున్నామని.. కాస్త ఆలస్యం కావడంలో తమ తప్పిదం ఉందన్నారు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# మాస్కోపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

## డ్రోన్‌లతో వరుస దాడులతో రష్యా ఉక్కికిబిక్కిరి

మాస్కో,జూన్22 : రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు కొనసాగిస్తోంది. మాస్కో, దాని పరిసరాల ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం వందల డ్రోన్లతో విరుచుకుపడింది. వాటిలో దాదాపు 60 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దాడుల నేపథ్యంలో నగరంలోని నాలుగు విమానాశ్రయాలు మూతపడ్డాయి. క్రిమియాపై కూడా ఉక్రెయిన్ దాడులకు పాల్పడుతుండడంతో అదనపు భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్ని బహిరంగ కార్యక్రమాలను అధికారులు రద్దు చేశారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఇంధన సదుపాయాలు, చమురు శుద్ధి కేంద్రాలపై కీవ్ దాడులు చేయడంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్లలో ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను నిలిపివేశారు. విరామం ఇవ్వకుండా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకు పడుతుండడంతో మాస్కో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతంపై రష్యా చేసిన ప్రతిదాడుల్లో ఒకరు మరణించగా.. ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో పలు వాహనాలు ధ్వంసమవ్వగా.. ఇంధన నిల్వ ట్యాంకులలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

# అభివృద్ధి పేరుతో అవినీతికి పెద్దపీట

## అమరావతిలో అవినీతికే తాము వ్యతిరేకం

## ఎంపి మిథున్ రెడ్డి ఘాటు విమర్శలు

మదనపల్లి,జూన్22 : అమరావతి అభివృద్ధికి తమ పార్టీ వ్యతిరేకం కాదని, అక్కడ జరిగే అవినీతికే వ్యతిరేకమని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ మిథున్ రెడ్డి స్పష్టం చేశారు. మదనపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. మదనపల్లిని జిల్లాగా ప్రకటించడం తప్ప అభివృద్ధి పరంగా ఎలాంటి పురోగతి లేదని ఆయన ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో మంజూరైన మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు. మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తయితే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. మదనపల్లె టౌన్ బ్యాంక్‌లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించిన మిథున్ రెడ్డి, ఈ విషయంపై తెలుగుదేశం పార్టీ నేతలే సమాచారం అందించారని తెలిపారు. దీంతో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలు, భూకబ్జాలు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను చైతన్యపరుస్తామని ఆయన అన్నారు. అభివృద్ధి గురించి ప్రశ్నిస్తే ప్రభుత్వం వైఎస్ జగన్‌పై వ్యక్తిగత ఆరోపణలు చేయడం తప్ప సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. డీఎస్సీ పరీక్షల వ్యవహారంపై కూడా మిథున్ రెడ్డి స్పందించారు. మొదటి ర్యాంక్ సాధించిన అభ్యర్థిని పక్కన పెట్టడంతోనే లీకేజీ వ్యవహారం బయటపడిందని అన్నారు. పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధించాల్సిన పరిస్థితిలో అడ్డదారుల్లో ఉద్యోగాలు పొందడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. డీఎస్సీ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మామిడి రైతులు కూటమి ప్రభుత్వ హయాంలో తీవ్రంగా నష్టపోయారని మిథున్ రెడ్డి ఆరోపించారు. రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. అలాగే ఆక్వా రైతులకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు.

## అమెరికాలో మరో తెలుగు విద్యార్థి మృతి

హైదరాబాద్,జూన్22 : ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన మరో తెలుగు విద్యార్థి అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయాడు. తెలంగాణకు చెందిన 26 ఏళ్ల అరుణ్ సాయి రెడ్డి బొ÷-లలెందుల అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. అరుణ్ స్వస్థలం మహబూబ్‌నగర్. ప్రస్తుతం ఫ్లోరిడాలోని టెంపాలో నివసిస్తోన్న అతడు.. స్టెమ్ ఓపీటీలో ఉన్నాడు. ఫుల్ టైమ్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తోన్న అరుణ్.. జూన్ 19న ఉన్నట్టుండి అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు.

# సంపాదకీయం

## ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన !

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. చినుకు పడడమే కష్టంగా మారింది. నైరుత ప్రవేశించినా చుక్కనీరు చిక్కలేదు. భూములు తడవలేదు. వ్యవసాయం పూర్తిగా పడకేసింది. నదులు నోరెళ్లబెట్టాయి. భూగర్భజలాలు అడుగంటాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సాగు ఎలా ఉన్నా తాగునీటికి తీవ్ర కటకట ఏర్పడేలా ఉంది. కృష్ణా,గోదావరి నదులు వట్టిపోయాయా అన్నట్లుగా మారాయి. ఈ పాటికి గోదావరిలో ఎగువ నుంచి నీరు వచ్చేది. దీంతో సాగు సాగేదెలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో పంటల ఎంపికపై తీసుకునే నిర్ణయాలు విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని వాతావరణ శాఖ తెలియచేస్తోంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. అయితే వాతావరణ పరిస్థితులు నిరంతరం మారుతుంటాయని, రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితిలో మెరుగుదల సంభవించే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ రైతాంగం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మృగశిర కార్తెతో పాటు ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకుంది. జూన్ తొలి వారం నుంచే నాగలి పట్టి, నారుమళ్లు పోసి, విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. అయితే సాధారణంగా కనిపించే నైరుతి వర్షపాత చురుకుదనం ఈసారి అనేక ప్రాంతాల్లో కనిపించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవు తోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. వాతావరణ మార్పుల కారణంగా నైరుతి రుతుపవనాల పురోగతిపై ప్రభావం చూపుతున్నాయి. భారత వాతావరణ శాఖకు సంబంధించిన గణాంకాలను ఉటంకిస్తూ ప్రచురితమైన నివేదికల ప్రకారం, వ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్య మవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు, విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

# పదోన్నతుల్లో ఇన్‌సర్వీస్ టీచర్లకు అన్యాయం!



రాష్ట్ర విద్యాశాఖలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ పాలకుల నిర్లక్ష్యం పుణ్యమా అని గత రెండు దశాబ్దాలుగా నిలిచిపోయిం ది. విద్యావ్యవస్థకు వెన్నెముకగా, రేపటి పౌరులను తీర్చిదిద్దే శిల్పులుగా కీర్తించబడే ఉపాధ్యాయ లోకం.. నేడు కెరీర్ ఎదుగుదల లేక తీవ్ర నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతోంది. పాఠశాలల పర్యవేక్షణలో అత్యంత కీలకమైన ఎంఇఒ, డిప్యూటీ ఇఒ, డిఇఒ, డైట్ లెక్చరర్ పోస్టుల పదోన్నతులు గత ఇరవైఏళ్లుగా పూర్తిగా స్తంభించిపోవడం పాఠశాల విద్యాశాఖ దౌర్భాగ్యానికి అద్దం పడుతోంది. ఉమ్మడి రాష్ట్రం నుండి నేటి స్వరాష్ట్రం వరకు పాలకులు మారినా, ఉపాధ్యాయుల తలరాతలు మాత్రం మారలేదు, సదా సరికదా.. మరింత దిగజారాయి. ఏకీకృత సర్వీస్ రూల్స్‌పై నెలకొన్న చట్టపరమైన చిక్కుముడులను విప్పడంలో పాలకుల ఉదాసీనత, స్పష్టమైన రాజకీయ విల్ పవర్ లేకపోవడం వల్లనే.. న్యాయంగా ఉపాధ్యాయులకు దక్కాల్సిన హక్కులు నేడు అగమ్యగోచరంగా, ఎండమావిగా మారాయి. నేరుగా స్కూల్ అసిస్టెంట్‌గా రిక్రూట్ అయి, విద్యార్హతలు కలిగిన ఒక ఉపాధ్యాయుడికి సర్వీసులో కనీసం ఎంఇఒ, డైట్ లెక్చరర్, డిప్యూటీ ఇఒ స్థాయికి ఎదిగే అన్ని అర్హతలూ ఉంటాయి. ఏకీకృత సర్వీస్ నిబంధనల లేమి కారణంగా గత ఇరవైఏళ్లుగా ఈ ఆశలన్నీ అడుగంటాయి. విద్యాశాఖలో నెలకొన్న తీవ్ర వైరుధ్యం ఏమిటంటే.. కారుణ్య నియామకాల కింద జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన నాన్-టీచింగ్ సిబ్బంది ఎలాంటి ఆటంకాలు లేకుండా క్రమంగా ప్రమోషన్లు పొందుతూ ఏకంగా జిల్లా విద్యాధికారి కుర్చీలో కూర్చుంటున్నారు. కానీ, ఉన్నత విద్యార్హతలతో నియామకమై దశాబ్దాల తరబడి తరగతి గదుల్లో సుద్దముక్కపట్టి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు మాత్రం రిటైర్మెంట్ వరకు ఒకే పోస్టుకు పరిమితం కావడం విద్యాశాఖలోని ఘోరమైన అసమానతలకు, వివక్షకు నిలువెత్తు సాక్ష్యం. ప్రభుత్వాలు ఈ దశాబ్దాల సమస్యను కేవలం ఉపాధ్యాయుల వ్యక్తిగత ప్రమోషన్ల పంచాయితీగానే చూస్తున్నాయి తప్ప, దీనివల్ల విద్యావ్యవస్థ పునాదులు కదిలిపోతున్నాయన్న సత్యాన్ని విస్మరిస్తున్నాయి. జిల్లా విద్యా శిక్షణ సంస్థల్లో కీలకమైన లెక్చరర్ పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా దర్శనమిస్తుండటంతో, కాబోయే ఉపాధ్యాయులకు నాణ్యమైన శిక్షణ అందడం లేదు. యువత గొంతుక 'ఛాత్రోం కీ గూంజ్' క్షేత్రస్థాయిలో వందలాది ఎంఇఒ, డిప్యూటీ ఇఒ పోస్టులు ఖాళీగా ఉండటంతో పాఠశాలలపై పర్యవేక్షణ పూర్తిగా అటకెక్కింది. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో పాఠశాలల పర్యవేక్షణ కుంటుపడింది. దీని వలన విద్యా ప్రమాణాలపై సైతం ప్రతికూల ప్రభావం పడుతోంది. ఈ సుదీర్ఘ అన్యాయానికి తోడు, గత వారం రోజుల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన రెండు నోటిఫికేషన్లు ఉపాధ్యాయుల గుండెల్లో గునపాలు దింపాయి. డిప్యూటీ ఇఒ, డైట్ లెక్చరర్, డైట్ సీనియర్ లెక్చరర్ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీచేసేందుకు నోటిఫికేషన్లు జారీకావడం ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. న్యాయంగా, సీనియార్టీ ప్రకారం ఉపాధ్యాయులకు ప్రమోషన్ల ద్వారా దక్కాల్సిన పోస్టుల విషయం తేల్చకుండా, డైరెక్ట్ కోటా కింద భర్తీ చేయడం ఎంతవరకు సమంజసం? ఈ నిర్ణయం సర్వీసులో ఉండి దశాబ్దాలుగా ప్రమోషన్ల కోసం కళ్లు కాయలుకాచేలా ఎదురుచూస్తున్న వేలాదిమంది సీనియర్ ఉపాధ్యాయుల నోట్లో మట్టి కొట్టడమే. ఇ-పేపర్ యాక్సెస్ అంతర్జాతీయ వార్తల సేవ ఫీచర్స్ విభాగం సేవ ఉపాధ్యాయుల న్యాయమైన ప్రమోషన్ల కోటాను కాపాడుతూ ఈ ఖాళీలను భర్తీ చేయకపోతే, ఉపాధ్యాయులకు ఒక ఘోరమైన దుస్థితి విద్యాశాఖలో తలెత్తబోతోంది. తాజా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ద్వారా రేపు డిప్యూటీ ఇఒలుగా, డైట్ లెక్చరర్లుగా రాబోయే వారిలో.. ఈ సీనియర్ ఉపాధ్యాయులు తరగతి గదుల్లో పాఠాలు చెప్పి తీర్చిదిద్దిన వారి సొంత శిష్యులే ఉంటారు.అక్షరాలు నేర్పిన గురువులు.. తాము పెంచి పెద్ద చేసిన శిష్యుల కింద సబార్డినేట్లుగా చేతులు కట్టుకుని నిలబడాల్సిన దుస్థితి ముంచుకొస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర విద్యాశాఖ బాధ్యతలను స్వయంగా సిఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తుండటంతో ఉపాధ్యాయ లోకం ఆయన వైపే ఆశగా చూస్తోంది. సిఎం జోక్యం చేసుకుని, ఈ నోటిఫికేషన్లవల్ల ఇన్-సర్వీస్ టీచర్లకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలి. ఏకీకృత సర్వీస్ రూల్స్ తీసుకొచ్చి, గురువుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ విద్యావ్యవస్థ బలోపేతం చేయాలి.

విద్యావ్యవస్థలోవిప్లవాత్మక మార్పులు, సంస్కరణలు తేవాలని నిరంతరం ఆకాంక్షించే సిఎం.. దశాబ్దాలుగా నలుగుతున్న ఈ ఉమ్మడి సర్వీస్ రూల్స్ ప్రతిష్ఠంభనకు తక్షణమే చరమగీతం పాడాల్సిన అవసరం ఉంది. సిఎం సత్వరం చొరవ తీసుకొని, చట్టపరమైన అడ్డంకులను తొలగించి ఏకీకృత సర్వీస్ నిబంధనలు సాధించే దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేయాలి.

## నాంపల్లి కోర్టుకు హాజరుకాని అల్లు అర్జున్

### షూటింగ్‌ల కారణంగా రాలేకపోయారని వివరణ

### విచారణ జూలై 6కు వాయిదా వేసిన కోర్టు

హైదరాబాద్,జూన్22 : హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసుపై నాంపల్లి కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న పలువురు కోర్టు ముందు హాజరుకాగా, సినీ నటుడు అల్లు అర్జున్ వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోయారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సంధ్య థియేటర్ కేసులో నాంపల్లి కోర్టుకు సినీనటుడు అల్లు అర్జున్ హాజరు కాలేదు. షూటింగ్ వల్ల వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఇవాళ కోర్టుకు హాజరుకావాలని 19 మంది నిందితులకు ఇటీవల నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, అల్లు అర్జున్ మినహా మిగతా నిందితులంతా న్యాయమూర్తి ఎదుట హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. అనంతరం కేసు విచారణను న్యాయమూర్తి కేసు విచారణను జులై 6కి వాయిదా వేశారు. అనంతరం ఈ కేసు విచారణను జులై 6వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఎ11 నిందితుడిగా పోలీసులు చేర్చిన విషయం తెలిసిందే. వ్యక్తిగతంగా అర్జున్ కోర్టు ముందు హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. అయితే అల్లు అర్జున్ గైర్హాజరుకు గల కారణాలను న్యాయస్థానానికి ఆయన తరఫు న్యాయవాది వివరించారు. సంధ్యా థియేటర్ యాజమాన్యాన్ని తొలి పదిమంది జాబితాలో చేర్చగా, మొత్తం 23 మందిపై పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 19 మంది నిందితులకు నాంపల్లి కోర్టు ఇప్పటికే సమన్లు జారీ చేసింది. ఈ ఘటన 2024 డిసెంబర్ 4వ తేదీన పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో అభిమానులు థియేటర్‌కు చేరుకోవడంతో తొక్కిసలాట జరిగింది. ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసు దర్యాప్తు పూర్తిచేసిన పోలీసులు 23 మందిని నిందితులుగా పేర్కొంటూ నాంపల్లి కోర్టుకు ఛార్జ్‌షీట్ సమర్పించారు. నిందితుల వ్యక్తిగత హాజరు పక్రియ పూర్తయిన తర్వాత ఈ కేసులో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టేందుకు నాంపల్లి కోర్టు సిద్ధమవుతోంది. ఈ కేసు సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారగా, కోర్టు తదుపరి విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

## ఫిలిప్పీన్స్‌లో కాల్పుల కలకలం

### స్కూల్లో కాల్పులకు తెగిచిన సాయుధులు

### ముగ్గురు విద్యార్థులు అక్కడిక్కడే మృతి

న్యూఢిల్లీ,జూన్22 : ఫిలిప్పీన్స్‌లో దారుణం జరిగింది. టాక్లోబన్‌లోని శాన్ హోసే నేషనల్ హైస్కూల్‌లో కాల్పుల ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ఇద్దరు సాయుధులు అక్రమంగా పాఠశాల ఆవరణలోకి ప్రవేశించి విద్యార్థులపై విచక్షణా రహితంగా తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. ఈ దాడిలో ముగ్గురు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ఐదుగురికి తీవ్రమైన బబుల్లెట్ గాయాలు అయ్యాయి. ఫిలిప్పీన్స్‌లో కొద్దికాలంగా అక్రమ ఆయుధాల చలామణి పెరిగిపోయింది. దీంతో ఇటీవల తుపాకీ సంబంధిత నేరాలు సర్వసాధారణం అయిపోయాయి. అయితే, పాఠశాలల్లో కాల్పులకు తెగబడటం చాలా అరుదైన ఘటనని స్థానిక మీడియా, అధికారులు చెబుతున్నారు. ఈ పాఠశాలలో మొత్తం 1,500మంది విద్యార్థులు ఉండగా.. కాల్పుల ఘటనతో పాఠశాల సిబ్బంది సహా వారంతా బయటకు పరుగులు తీశారు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి దాడికి ఉపయోగించిన తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అయితే, నిందితుల్లో ఒకరిని అదే పాఠశాలకు చెందిన విద్యార్థిగా పోలీసులు గుర్తించారు. మరోవైపు దాడిలో గాయపడిన ఐదుగురిని సమీప ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనతో స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ మేరకు పాఠశాల చుట్టుపక్కల ప్రాంతమంతా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాల్పులకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.


## అమెరికాకు షాకిచ్చిన చైనా

### పలు రక్షణ కంపెనీలపై ఆంక్షలు

బీజింగ్,జూన్22 : అమెరికాకు చెందిన 10 సైనిక సంబంధిత కంపెనీలపై చైనా ఆంక్షలు విధించింది. ఆయా కంపెనీలకు పౌర-మిలిటరీ వినియోగ వస్తువుల ఎగుమతిని నిషేధిస్తున్నట్లు తెలిపింది. వీటిల్లో రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. అగ్రరాజ్యం ఇటీవల తమ రక్షణ రంగ కాంట్రాక్టుల్లో చైనా టెక్ కంపెనీలను నిషేధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ చర్యలు చేపట్టింది. దీంతో పాటు అమెరికాకు చెందిన 46 కంపెనీల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా తమ ప్రభుత్వ రంగ సంస్థలను నిరోధించనున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతే కాకుండా ఇతర దేశాలు చైనా నుంచి కొనుగోలు చేసిన వస్తువులను.. ఆంక్షలకు గురైన అమెరికా కంపెనీలకు బదిలీ చేయడాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపింది. చైనా సైన్యంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అలీబాబా, బైడూ సహా పలు టెక్ కంపెనీలపై ఈ నెల ఆరంభంలో అమెరికా రక్షణ శాఖ నిషేధం విధించింది. ఇకపై ఆయా కంపెనీలు అగ్రరాజ్య సైనిక కాంట్రాక్టులను పొందలేవని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయిన ట్రంప్.. ఇరు దేశాల మధ్య పరస్పర వాణిజ్య సహకారంపై అంగీకారానికి వచ్చారు.

## కోరికలకు కళ్లెం వేయాలి!

తిరుమల : కోరికలే అనర్థానికి హేతవురు. అది కావాలి..ఇది కావాలి అని అనవసరమైన కోర్కెలతో మనిషి జీవితాన్ని నరకప్రాయం చేసుకుంటున్నాడు. ఉన్నంతలో బతకడం అవసరం. అందుకే పెద్దలు గొంగడి ఉన్నంత కాలు చాపుకోవాలని అంటారు. అంటే మన స్థోమతకు తగ్గ ఆలోచనలు మాత్రమే చేయాలి. కోరకిలను అదుపులో పెట్టుకోవాలి. వాటికి కళ్లెం వేయాలి. యవ్వనంలో ఉంటే ముసలితనం వచ్చేస్తుందని భయపడతాం. ధనవంతులమైతే అనుకోకుండా పేదవాళ్లమైపోతామేమో అని భయపడతాం. ఏ స్థితిలోనూ భయం కలిగించనిది ఒకే ఒక్కటి. అదే వైరాగ్యం. 'నాకు అక్కర్లేదు!' అనుకునే వాడు ఉన్నంత నిర్భయంగా మరెవ్వడూ ఉండడు. 'నాకిది కావాలి!' అనుకుంటే వంద రకాల తాపత్రయాలు పడాల్సిందే. శివుడు మన్మథుని గర్వాన్ని నిర్మూలనం చేశాడు. మనం కూడా శివ భక్తులమై సంసారంలో ఉంటూనే కామవాంఛలను జయించాలి. అది గ్రహిస్తే యాభై ఏళ్లు దాటే సరికి కాస్త నెమ్మదిగా వైరాగ్య మార్గంలో పడతాం. అప్పుడు నిర్భయంగా ఉండగలుగుతాం. జీవితంలో ఏదైనా భయం కలిగించేదే. పాండిత్యం సంపాదిస్తే, అంతకన్నా ఎక్కువ పాండిత్యం ఉన్న వాడు వస్తాడని భయపడతాం. అందంగా ఉంటే ఈ అందం దెబ్బతింటుందేమోనని భయపడతాం. ఆ గర్వాన్ని జయించాలంటే పార్వతీపరమేశ్వరులిద్దరినీ మనం ఆశ్రయించాలి. నారదుడు మొదలుకుని ముఖ్యమైన మునులందరూ నిరంతరం భగవంతుని ధ్యానంలో గడిపారు. వారి మనః పద్మాలలో శివుడు తుమ్మెదలా విహరిస్తున్నాడు. మనమూ అలా నిరంతరం భగవంతుని ధ్యానంలో గడుపుదాం. మనస్సులో భక్తి తప్ప మరేమీ ఉండకూడదు. 'అంతా నువ్వే!' అని భగవంతుణ్ణి వేడుకోవాలి. దేశం బాగుపడటానికి, జీవితం బాగుపడటానికి ఆధ్యాత్మికతను మించిన మార్గం లేదు. శంకరాచార్యుల నుంచి వివేకానందుల వరకు ఇదే ఆచరించి చూపారు. కావాలను కుంటేనే సమస్యలు వచ్చి పడతాయి. అందువల్ల తాహతుకు మంచి కోరికలను కోరుకుంటే సమస్యలు చుట్టుముడతాయి.



ఆధ్యాత్మికం

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

● ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలి ● అవినీతి, ఉద్దేశపూర్వక జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదు ● ఫీల్డ్ సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి ● 99 రోజుల ప్రగతి కార్యక్రమ వివరాలను నాణ్యతతో సమర్పించాలి ● జిల్లా అధికారులతో పరిపాలనా అంశాలపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ,అదనపు కలెక్టర్లు జే. అరుణ శ్రీ, కొప్పుల వెంకట్ రెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో పరిపాలనా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులు, వినతిపత్రాల పరిష్కారం పై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని, ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులో పరిష్కరించి తప్పనిసరిగా సమాధానం అందించాలని ఆదేశించారు. పారదర్శకత, జవాబుదారీతనం ప్రతి అధికారిలో ఉండాలని, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద వచ్చే దరఖాస్తులకు కూడా నిర్ణీత సమయంలో సమాధానాలు అందించాలని సూచించారు. జిల్లా పరిపాలనలోని అధికారులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావాలని, అన్ని శాఖలు తమ పరిధిలోని ఫీల్డ్ సిబ్బంది హాజరు, పని తీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా ప్రజలకు అందేలా శాఖాధిపతులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కొన్ని శాఖల్లో ఫైళ్ల పరిష్కారంలో అనవసర జాప్యం జరుగుతోందన్న ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి శాఖాధికారి తమ శాఖలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్రమం తప్పకుండా సమీక్షించి, ఉద్దేశపూర్వక జాప్యాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. కొంతమంది ఫీల్డ్ సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, అవినీతిని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు,



సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, హానరేరియం సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని, సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కార్యాలయ భవనాల నిర్వహణతో పాటు కార్యాలయ ఆవరణ, ముందుభాగంలోని ఖాళీ స్థలాలను కూడా పరిశుభ్రంగా ఉంచడం సంబంధిత శాఖల బాధ్యతేనని తెలిపారు. త్వరలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖలు తమకు సంబంధించిన వివరాలను సంక్షిప్తంగా, నాణ్యతతో కూడిన సమాచారంగా సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. సమర్పించే నివేదికలు వాస్తవాధారితంగా, సమగ్రంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి, డిఆర్ఓ రాజేశ్వరి లతో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన నోముల రాజేశ్వర్ రెడ్డి తమ ఇంటిని ఆన్లైన్లో నమోదు చేసేందుకు దరఖాస్తు చేసుకోగా పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమ పేరు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపిడిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు రామగుండం గౌతమినగర్ కు చెందిన డి కాశయ్య మల్కాపురం గ్రామంలో సర్వేనెంబర్ 125/3 లో గల 20 ఎకరాల భూమి గతంలో ఎక్స్ సర్వీస్ మెన్ కోసం 1981 లో కేటాయించడం జరిగిందని , దీనిలో ఎటువంటి ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అనుమతి ఇవ్వరాదని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డీవో పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన వేముల నర్సమ్మ సర్వే నెంబర్ 474/1 లో ఎకరం భూమి ఉందని , తన భూమిని కొంతమంది ఆక్రమించాలని చూస్తున్నారని, తన భూమి జోలికి ఎవరు



రాకుండా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ఓదెల కు రాస్తూ నిబంధనలు ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరిఖని సూర్య నగర్ కు చెందిన ఆర్. రాధ తన కుమారుడికి ప్రభుత్వ విద్యా సంస్థలోని హాస్టల్లో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తారా లేక పేదలచే ఆక్రమించమంటారా

● రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ సూటి ప్రశ్న ● డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం సిపిఐ కలెక్టరేట్ ముందు ధర్నా

**కరీంనగర్ టౌన్, జూన్22(ది క్రైమ్ న్యూస్):** గత ప్రభుత్వ హయాంలో నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు పంచుతారా లేక సిపిఐ ఆధ్వర్యంలో ఆక్రమించుకోమంటారా తక్షణమే తెలపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ సూటి ప్రశ్న వేశారు. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని సోమవారం కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగిందని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో ఎంతో మంది నిరుపేదలు ఇండ్లు లేక అద్దె ఇండ్లల్లో నివాసం ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని రోజువారీ కూలీ పనులు చేసుకొని,చిన్న చిన్న ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకొని చాలీ చాలని ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటు, ఇంటి అద్దె కట్టలేక, ఆర్థికంగా ఏమీ లేని కుటుంబాలు కావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. గత ప్రభుత్వ హాయంలో దాదాపు 600ఇండ్లను చింతకుంట ప్రాంతంలో నిర్మాణం చేసి ఉన్నాయని, నిర్మించి దాదాపు పది సంవత్సరాలు కావస్తున్నా నేటికీ వాటిని అర్హులైన వారికి కేటాయించకపోవడం వల్ల అవి నిరుపయోగంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా ఇప్పటివరకు వాటిని పంపిణీ చేయలేదని,తక్షణమే ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేస్తదా లేక సిపిఐ ఆధ్వర్యంలో పేదలచే ఆ డబుల్ బెడ్ రూం ఇండ్లను ఆక్రమించమంటారా ప్రభుత్వం తేల్చాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్.డి. ఓ) షర్మిల కు సిపిఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బీర్ల పద్మ,కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, కొట్టె అంజలి, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వరుకోలు సదానందం, దుడ్డేల సమ్మయ్య, సిపిఐ శాఖ కార్యదర్శులు గామినేని సత్యం, చెంచల మురళి, నగునూరి






రమేష్, నునావత్ శ్రీనివాస్, బాకం ఆంజనేయులు, ఈ. భారతి,కాల్వ శ్రీనివాస్,తంగెళ్ళ సదయ్య, కసిరెడ్డి సందీప్ రెడ్డి, బోయిని విష్ణు, మమత, స్వాతి, భూక్యా ముని, స్రవంతి, గుర్రం సదానందం, బరిగెల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# చిల్లర మాటలు మానుకో... పుట్ట మధు ఆస్తుల చిట్టా సిద్ధం

● 900 కోట్లు ఎక్కడివి ● మంత్రి శ్రీధర్ బాబు ను విమర్శించే స్థాయి పుట్ట మధుకు లేదు ● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం ఫైర్



**కరీంనగర్ బ్యూరో చీఫ్ (ది క్రైమ్ న్యూస్):** సంస్కారాన్ని మరచి రాజకీయ భిక్ష పెట్టింది మరచి పోయి చిల్లర మాటలతో రాజకీయాలు చేసే పుట్ట మధు తీరు మారకుంటే గుణపాఠం తప్పదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం అన్నారు. సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్‌లతో పాటు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పుట్ట మధు పెద్ద ఎత్తున అక్రమ ఆస్తులు కూడబెట్టారని,900 కోట్ల ఆస్తులు ఎక్కడివి అని అడిగారు. బీఆర్ఎస్ పార్టీ మూడు వేల కోట్లు దోచుకుంటే,పుట్ట మధుకు తొమ్మిది వందల కోట్ల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయని ఆయన నిలదీశారు. కేసీఆర్, కేటీఆర్‌లు లక్షల కోట్లు సంపాదిస్తే, గత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేల కోట్లు వెనకేశారని ఆరోపించారు. పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ కాకముందు పుట్ట మధు ఆస్తులు ఎంత, ప్రస్తుతం ఎంత అనే విషయాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పుట్ట మధు ఆస్తులపై విచారణ జరపాలన్నారు. పుట్ట మధు సంబంధించిన పూర్తి ఆస్తుల చిట్టా ప్రస్తుతం తమ ముందు సిద్ధంగా ఉందని తెలిపారు. దివంగత నేత దుద్దిళ్ల శ్రీపాద రావు పెట్టిన రాజకీయ బిక్షతోనే పుట్ట మధు ఈ స్థాయికి వచ్చారని గజ్జల కాంతం గుర్తు చేశారు. ప్రస్తుత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇంటి గేటు వద్ద నిలబడితే, ఆయన దయతో బిక్షగా జెడ్పీటీసీగా పోటీ చేసే అవకాశం వచ్చిందని, ఆ పాత చరిత్రను ఒకసారి గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురించి మాట్లాడే నైతిక అర్హత పుట్ట మధుకు లేదని, పుట్ట మధు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. కేవలం ఒకే ఒక్కసారి ఎమ్మెల్యే అయిన వ్యక్తికి వేల కోట్ల ఆస్తులు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఇసుక దందా, గంజాయి వ్యాపారాలు చేస్తూ అక్రమాలకు పాల్పడ్డారని, గతంలో దళిత వ్యక్తిపై దాడులు చేయించడమే కాకుండా, సంచలనం సృష్టించిన అడ్వకేట్ దంపతుల హత్య ఉదంతం వెనుక ఉన్నది నువ్వు కాదా అని పుట్ట మధును నేరుగా ప్రశ్నించారు. గతంలో మంథని మధును చంపి కాలువలో పడేసింది మీ అనుచరులేనని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భారీ అప్పుల ఊబిలోకి నెట్టి ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సుమారు 8 లక్షల కోట్ల అప్పుల పాల్జేసిందని, అందులో 3 లక్షల కోట్లను దోచుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట 1.50 లక్షల కోట్ల వ్యయంలో లక్ష కోట్ల రూపాయల మేర అవినీతి జరిగిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో వేల కోట్ల విలువైన సుమారు 30 వేల ఎకరాల భూములను ఆక్రమించారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా బొంద పెడతారని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం కాబోతుందంటూ ఆయన ఈ సందర్భంగా రాజకీయ జోస్యం చెప్పారు. పదేళ్ల పాటు దొర కుటుంబాన్ని నమ్మి మోసపోయిన ప్రజలు ఇకపై ఆ పార్టీని మరో పదేళ్లయినా నమ్మే పరిస్థితి లేదని గజ్జల కాంతం వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజలు పూర్తిగా విశ్వాసం కోల్పోయారని, మళ్లీ ఆ పార్టీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాను గనుక నోరు తెరిస్తే తట్టుకోలేక ఉరేసుకునే పరిస్థితి వస్తుందని, కాబట్టి మాట్లాడే ముందు జాగ్రత్తగా మాట్లాడాలని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సముద్రాల అజయ్, కేశవేని రవీందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారంతో ప్రజలకు సమయం, ధనం ఆదా

- రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

- 83 సైబర్ నేర కేసుల్లో బాధితులకు రూ.73,67,714 తిరిగి అందజేత




**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారంతో ప్రజలకు సమయం, ధనం ఆదా అయ్యాయని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో రికార్డు స్థాయిలో మొత్తం 6,545 కేసులు పరిష్కరించ బడ్డాయన్నారు. ఇందులో ఐపీసీ కేసులు 637, ఎసఎలఎల్ కేసులు 46, ఈ-పెట్టి కేసులు 3,097, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 2,809, విపత్తు నిర్వహణ చట్టం ఈ-పెట్టి కేసులు 2 ఉన్నాయి. వీటితో పాటు సైబర్ నేరగాళ్ల బారిన పడిన బాధితులకు ఊరట కలిగిస్తూ మొత్తం 83 కేసుల్లో రూ.73,67,714 రికవరీ చేసి తిరిగి అందజేశామని, ఇందులో కమిషనరేట్ పరిధిలోని 76 కేసులకు రూ.27,35,072, సీసీపీఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 7 కేసులకు రూ.46,32,647 ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా స్వల్ప చట్టపరమైన కేసులు వేగంగా పరిష్కారం కావడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. అధికారులు, కోర్టు సిబ్బంది గత 15 రోజులుగా కౌన్సిలింగ్ నిర్వహించి, రాజీ మార్గమే ఉత్తమ మార్గమని అవగాహన కల్పించడంతోనే నిర్దేశించిన లక్ష్యానికి మించి కేసులు పరిష్కరించగలిగామని వివరించారు. ఈ విజయవంతమైన ఫలితాలు సాధించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి త్వరలో రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేసిన ప్రధాన న్యాయమూర్తులు, జిల్లా న్యాయ సేవా సంస్థలకు పోలీస్ శాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీనివాస్ నగర్ 1వ వార్డు తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్

**కరీంనగర్ టౌన్, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):** మానకొండూర్ మండలం శ్రీనివాస్ నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 1వ వార్డు కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్ జిల్లా కలెక్టర్ ని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ కి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శ్రీనివాస్ నగర్ మానకొండూర్ గ్రామాల మధ్య ఉన్న 1వ వార్డు కాలనీలో దాదాపు 40 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. ఎన్ హెచ్ -563 ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా గ్రామం నుండి ఈ కాలనీకి మంచినీటి సరఫరా నిలిచిపోయిందని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు కాలనీ సమీపం నుండే లింగాపూర్ గ్రామానికి వెళ్లే మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ ఉన్నందున, అక్కడ ఒక మిని వాటర్ ట్యాంక్ నిర్మించి ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు అందించే అవకాశం ఉందని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి, యుద్ధప్రాతిపదికన నిధులు మంజూరు చేసి కాలనీ ప్రజల దాహార్తిని తీర్చాలని సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్ ఈ ప్రెస్ నోట్ ద్వారా విజ్ఞప్తి చేశారు.

## మా భూమికి దారి కల్పించండి..

ఆరు ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం లేదని కలెక్టర్‌కు వినతి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తన పొలానికి వెళ్లే దారిని కల్పించాలని, భూమి వివాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే భూములను సీజ్ చేసి కోర్టుకు పంపాలని ఓదెల మండలానికి చెందిన రైతు తాటికొండ రమేష్ ప్రజా వాణిలో కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో తనకు సర్వే నంబర్ 943లో 1.05 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, అయితే చుట్టుపక్కల భూస్వాములు గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ప్రభుత్వ సర్వే ఆధారంగా భూమిని కొలిపించుకున్నప్పటికీ, సర్వే అధికారులు ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను కొందరు తొలగించారని పేర్కొన్నారు. సుమారు 7 గుంటల భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నారని, దీనిపై కేసులు నమోదైనప్పటికీ ఇప్పటివరకు తనకు న్యాయం జరగలేదని వాపోయారు. తన పొలంలో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారని, వ్యవసాయ పనులకు వచ్చే కూలీలను కూడా బెదిరించి పంపిస్తున్నారని తెలిపారు. అలాగే రేవులకుంట చెరువును ఆక్రమించి బావులు తీయడం, డి-86 కాలువను ధ్వంసం చేయడం వల్ల తమ భూమికి సాగునీరు అందకుండా పోయిందని ఆరోపించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం గత ఆరు సంవత్సరాలుగా కలెక్టర్లు, ఎంఆర్వోలు, ఆర్డీవోలు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. 2024 నవంబర్, డిసెంబర్ నెలల్లో మరియు 2025 మార్చి, మే నెలల్లో కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. ఇటీవల 2026 జూన్ 18న ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేసినప్పటికీ భూమి కొలతలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈజ్‌మెంట్ హక్కుల చట్టం ప్రకారం తమ పొలానికి రహదారి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## "హలో ఉప సర్పంచ్ - చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- మానకొండూర్‌లో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించిన మండల ఉప సర్పంచ్‌లు



**కరీంనగర్ టౌన్, జూన్22(ది క్రైమ్ న్యూస్):** మండల కేంద్రంలో మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు గడ్డి గణేష్ ఆధ్వర్యంలో మండల సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా కోఆర్డినేటర్ ఆకు బత్తిని విజయ్ కుమార్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉప సర్పంచ్లకు చెక్‌పవర్ రద్దు అనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న నిర్వహించే హలో ఉప సర్పంచ్ చలో హైదరాబాద్ అనే కార్యక్రమానికి మండలంలోని ఉపసర్పంచ్‌లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి రాపాక ప్రవీణ్, ఉపాధ్యక్షులు మర్రి కుమారస్వామి, ఈదుముల సంపత్, వేల్పుల కొమురయ్య వివిధ గ్రామాల ఉపసర్పంచులు ఆడెపు రమేష్, మేకల మహేందర్, ముడగాని అనిల్ గౌడ్, కాల్వ శ్రీనివాస్ యాదవ్, పొలవేణి రాజేష్, జిల్లెల్ల రాజు, పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల పాత్ర కీలకం

**● ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**




**కరీంనగర్ టౌన్, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):** ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల పాత్ర అత్యంత కీలకమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని సాయిరాం గార్డెన్‌లో సోమవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బీఎల్ఓ, సూపర్ వైజర్లకు నిర్వహించి అవగాహన శిబిరానికి ఆయన ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తిని కలిగి ఉంటుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటర్ల జాబితా ఎంతో అవసరమని అన్నారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు చేసుకోవడం ఎంత ముఖ్యమో, జాబితాలోని అర్హులైన వారి పేర్లు తొలగింపునకు గురి కాకుండా చూసుకోవడం అంతే ముఖ్యమన్నారు. కేంద్ర చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఓటర్ల పేర్లు జాబితా నుంచి అక్రమంగా తొలగింపునకు గురి కాకుండా చూడాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవడం, తప్పులు ఉండటం లేదా చిరునామా మార్పులు వంటి పొరపాట్లను వెంటనే సవరించుకోవాలని ఆయన సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవడం, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలకు సంబంధించి ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. సర్ విధులు నిర్వహించే అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ శిబిరంలో తహసీల్దార్లు కర్ర శ్రీనివాస్ రెడ్డి(తిమ్మాపూర్), ఇప్ప నరేందర్ (గన్నేరువరం), సురేష్ (ఇల్లంతకుంట), శ్రీకాంత్ (బెజ్జంకి), విజయ్ కుమార్ (మానకొండూర్), కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గోదారి శోభారాణితోపాటు పలువురు ఆర్ఐలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు







**లక్షెట్టిపేట, జూన్ 22 (ది క్రైమ్ న్యూస్):** పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడి పరిస్థితులను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను స్వయంగా పలకరించి వారి ఆరోగ్య పరిస్థితులు, అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమైన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆసుపత్రిలో పరిశుభ్రత, రోగులకు మెరుగైన సేవలు అందించే విషయంలో పలు సూచనలు చేశారు. ఆసుపత్రి పవిత్రతను కాపాడే ఉద్దేశ్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సహా ఎవరైనా ఆసుపత్రి లోపలికి ప్రవేశించే సమయంలో చెప్పులు బయట విడిచి రావాలని వైద్యులకు సూచించారు. అనంతరం మున్సిపాలిటీలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులపై స్పందిస్తూ పట్టణ అభివృద్ధికి అత్యంత కీలకమైన రోడ్డు వెడల్పు పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపేది లేదని, ఎవరి అడ్డంకులు వచ్చిన అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్, ఎమ్మార్వో దిలీప్, మున్సిపల్ చైర్అం పర్సన్ దొంత అంజలి - నర్సయ్య , వైస్ చైర్ పర్సన్ మోత్కూరి రాజేశ్వరి- వెంకటస్వామి గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్ చంద్, వైస్ చైర్మన్ ఆరీఫ్ , కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, జిల్లా ఆర్ జీ పి ఆర్ ఎస్ గడ్డం త్రిమూర్తి, జిల్లా నాయకులు చల్లా నాగభూషణం , పూర్ణచందర్ రావు, సర్పంచ్లు, కార్పొరేటర్లు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# శాస్త్రీయ దర్యాప్తు రంగంలో పోలీసులు సరికొత్త సాంకేతిక మెళకువలను పెంపొందించుకోవాలి

**● రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ● కమిషనరేట్‌లో మూడవ పోలీస్ డ్యూటీ మీట్ 2026 కార్యక్రమం**






**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందిలో వృత్తిపరమైన పనితీరును మెరుగుపరిచేందుకు మరియు శాస్త్రీయ దర్యాప్తు రంగంలో సరికొత్త సాంకేతిక మెళకువలను పెంపొందించేందుకు పోలీస్ డ్యూటీ మీట్ ఎంతగానో దోహదపడుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. గౌరవ డీజీపీ ఆదేశాల మేరకు పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన పోలీసులకు సోమవారం కమిషనరేట్ స్థాయి మూడవ పోలీస్ డ్యూటీ మీట్--2026 కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లకు చెందిన అధికారులు, సిబ్బందికి కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ ట్రాకింగ్, పేలుడు పదార్థాల గుర్తింపు, యాంటీ-సబోటేజ్ తనిఖీలు, కంప్యూటర్ అవగాహన, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విభిన్న విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని, అనంతరం జాతీయ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే అవకాశమూ ఉంటుందని వివరించారు. శాస్త్రీయ దర్యాప్తు, వేలిముద్రల విశ్లేషణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవడానికి, కేసుల దర్యాప్తులో మెళకువలను నేర్చుకోవడానికి, పోలీసు నైపుణ్యాలను ప్రదర్శించడానికి, సంక్లిష్టమైన కేసుల పరిష్కారానికి అవసరమైన ఆలోచనలను పరస్పరం పంచుకోవడానికి, వృత్తిపరమైన పనితీరు, సామర్థ్యాలను మెరుగు పరచుకోవడానికి పోలీస్ డ్యూటీ మీట్ ఎంతగానో ఉపయోగపడుతుందని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి జోన్, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగే పోలీస్ డ్యూటీ మీట్‌లలో పాల్గొనే అవకాశం లభిస్తుందని, దీనివల్ల వివిధ ప్రాంతాల పోలీసు అధికారుల మధ్య పరస్పర సహకారం, ప్రోత్సాహం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారందరూ తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలని, ఇక్కడ ఎంపికై కాళేశ్వరం జోన్ తరఫున, రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించి రామగుండం కమిషనరేట్‌కు, కాళేశ్వరం జోన్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఎ భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ కె శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేందర్, ఏఓ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు, ఆరఐలు, సీఐలు, ఎసఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరిఖని లో రెస్టారెంట్లకు వెలితే డైరెక్ట్ నరకానికే

**● కనీస శుభ్రత పాటించిన 10 రెస్టారెంట్లు, పలు బేకరీలు**





**గోదావరిఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** గోదావరిఖని ప్రాంతమంతటా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఇంచార్జ్) అంకిత్ రెడ్డి ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గత వారం గోదావరిఖనిలో నమోదైన ఫుడ్ పాయిజనింగ్ ఘటనకు అనుసంధానంగా ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమం చేపట్టబడింది. మొత్తం 10 రెస్టారెంట్లు మరియు బేకరీలను తనిఖీ చేయడం జరిగింది. తనిఖీ చేసిన సంస్థలు క్రింది విధంగా ఉన్నాయి: 1. బాలాజీ వికాస్ స్వీట్ హౌస్ 2. తాజ్ ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ 3. దసరా దావత్ రెస్టారెంట్ 4. ఎస్ఏ అన్‌లిమిటెడ్ కేఫ్ అండ్ బేకర్స్ 5. వాసంతి లైవ్ కిచెన్ 6. ఏకే మల్టీబైట్స్ బేకర్స్ 7. దియా ఫ్యామిలీ రెస్టారెంట్, పన్నూర్ 8. జాయికా మండీ హౌస్ 9. బేకర్స్ డిలైట్ ది లైవ్ కేక్ షాప్ 10. డేనియల్స్ కేక్ షాప్ పైన పేర్కొన్న 10 ఆహార వ్యాపార సంస్థలలో కొన్ని రెస్టారెంట్లలో ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించబడ్డాయి. కొన్ని రెస్టారెంట్లలో ఆహార రంగులు ఉపయోగిస్తున్నట్లు గుర్తించబడింది. వాటిని వెంటనే పారవేయడం జరిగింది. అలాగే, ఆ ఆహార రంగులతో తయారు చేసిన ఆహార పదార్థాలను కూడా పారవేయడం జరిగింది. ఎస్ఏ అన్‌లిమిటెడ్ కేఫ్ అండ్ బేకర్స్ వంటగది పూర్తిగా అనారోగ్యకరమైన మరియు అపరిశుభ్రమైన పరిస్థితుల్లో ఉన్నట్లు గుర్తించబడింది. గుర్తించిన లోపాలను సరిదిద్దడానికి ఒక వారం గడువు ఇవ్వబడింది. అలాగే, జాయికా మండీ హౌస్‌లో లభించిన మయోనైస్ ముడి గుడ్లతో తయారు చేసినదిగా అనుమానం వ్యక్తమైంది. ముడి గుడ్లతో మయోనైస్ తయారు చేయడం అనుమతించబడదు. కావున మయోనైస్ నమూనాను సేకరించడం జరిగింది.

## 27వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ టౌన్, జూన్22(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా 27వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో రూ.6.5 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రాధాన్యత ఆధారంగా చేపడుతూ, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. అంబేద్కర్ నగర్ ప్రాంత ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగుపడేలా ఈ పైప్‌లైన్ పనులు ఉపయోగపడతాయని, పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ బొట్ల శ్యామల కిరణ్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

**- ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల దోపిడీ అరికట్టాలి**

**- ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్**




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులపై కఠిన నియంత్రణ చట్టం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ (భారత విద్యార్థి ఫెడరేషన్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్ లు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు తీవ్రమైన సమస్యలతో కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతుల లోపం, ఉపాధ్యాయుల కొరత, సరైన తరగతి గదులు లేకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, స్టేషనరీ సరఫరా సమయానికి అందడం లేదని, మధ్యాహ్న భోజనం నాణ్యతలో లోపాలు ఉన్నాయని, పాఠశాలలలో టాయిలెట్స్ సరిగా లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో విచ్చలవిడిగా పాఠ్యపుస్తకాల పేరిట అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. వెంటనే ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల యొక్క సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు ప్రారంభం




**కరీంనగర్ టౌన్, జూన్22(ది క్రైమ్ న్యూస్):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం (జూన్-26) సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ సోమవారం సీపీ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ, యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాలల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన సదస్సులు, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ, డ్రగ్-ఫ్రీ క్యాంపస్ డిక్లరేషన్ కార్యక్రమాలు, కమ్యూనిటీ విజిలెన్స్ కమిటీల ఏర్పాటు వంటి కార్యక్రమాలు వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## నీటి సమస్యకు పరిష్కారం



**రామగిరి,జూన్ 22(ది క్రైమ్ న్యూస్):** కమాన్ పూర్ మండలం నాగారం లో వాడుక నీటి సమస్యకు పరిష్కారం చేయడం జరిగిందని సర్పంచ్ పొన్నగంటి కుమార్ తెలిపారు. నాగారం గ్రామంలోని స్మశాన వాటిక, ధోబి ఘాట్, నర్సరీలకు చెందిన ఒకే బావి నీరు అందించేవారు. ఇటీవల వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో అట్టి బావిలోని పూడికను తీయడం జరిగిందని సర్పంచ్ పేర్కొన్నారు. దీంతో గత కొన్ని రోజులుగా నీరు లేక ఇబ్బందులు పడ్డ రజకులకు, నర్సరీ మొక్కలకు సమస్య తీరిపోయింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్నాల శ్రీనివాస్, గడ్డి సతీష్, బొంకూరి సురేష్, తో పాటు పలువురు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా డిఫెన్స్ అకాడమీల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారు

## ●జర్నలిలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల ఫీజుల్లో 100శాతం రాయితీ కల్పించాలి





**కరీంనగర్ టౌన్, జూన్22(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు విధ్యా మాఫియా విధానాన్ని కొనసాగిస్తూ పేద ప్రజలను నిలువునా దోచుకుంటున్నారని మండిపడ్డారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్,బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకత్వ పిలుపుమేరకు కరీంనగర్ జిల్లా బిఆర్ఎస్వి విభాగం ఆధ్వర్యంలో విద్య వ్యవస్థల్లో నెలకొన్న అవస్థలు వాటిపై మీ స్పందన అనే పేరుతో ప్రత్యేక వినతి పత్రాన్ని నేడు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్వి నేతలతో కలిసి కరీంనగర్ జిల్లా విద్యాధికారిని వారి కార్యాలయంలో కలిసి వారికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న దోపిడీని డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. నోటు పుస్తకాలు, యూనిఫార్మ్, స్టేషనరీ పేరుతో.. పేదవాళ్ళను దండు కుంటున్నారని, వీటిని అరికట్టాల్సిందిగా డి ఈ ఓ కు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా డిఫెన్స్ అకాడమీ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థలు నడుపుతున్నారని, వీటి పైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో ఒక మాఫియా కొనసాగుతుందని విద్యార్థుల ద్వారా.. డబ్బులు దండుకొని కేవలం రెండు మూడేళ్లలోనే కోటీశ్వరులు అవుతున్నారని.. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలలు నడుపుతున్నారని.. నోటు పుస్తకాలు, యూనిఫార్మ్, ఇలా ఎన్నో రకాలుగా విద్యార్థులను దోచుకుంటున్నారని, వారికి ఎలాంటి స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రెండు రోజుల్లో ఏ ఏ పాఠశాలలో ఎంత స్థాయిలో పుస్తక నిల్వలు ఉన్నాయో అవి ఎక్కడెక్కడ నిలువలు చేశారో వాటి సమగ్రమైన వివరాలతో కూడిన పత్రాలను డీఈఓ కు అందజేస్తామని తెలిపారు. వీటన్నింటి పైన డీఈవో సానుకూలంగా స్పందించారని.. వారిపై తమకు విశ్వాసం ఉందన్నారు. ఎప్పటికప్పుడు ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న అవినీతిని డిఈ వో దృష్టికి తీసుకువస్తామని వాటికి వారు పరిష్కరిస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నామన్నారు. ఒకవేళ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోతే తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎలాంటి ఉద్యమైతే శాంతియుతంగా చేసామో అలాంటి ఉద్యమము మళ్లీ చేపడతామన్నారు. అయినా కూడా స్పందించకపోతే విద్యాసంస్థలపై దాడులకు కూడా వెనకాడబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యాశాఖకు ఇప్పటి వరకు మంత్రి లేకపోవడం బాధాకరం అన్నారు. దాంతోపాటు జర్నలిస్టుల పిల్లలకు పాఠశాల స్థాయిలో 100శాతం ఫీజులో రాయితీ కల్పించాలని డీఈఓ ను కోరగా వారు వెంటనే స్పందించి ఇది వరకే ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 100 శాతం రైతు కల్పించాలని ఇదివరకే ఆర్డర్లు జారీ చేశామని వాటిని ఎవరైనా ఉల్లంఘించినట్టు తమ దృష్టికి తీసుకువస్తే ఆ పాఠశాలపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని. వారు తెలిపారని పేర్కొన్నారు.జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో రాయితీ 100 శాతం రాయితీ కల్పించే వరకు జర్నలిస్టులకు అండగా బిఆర్ఎస్వి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలోమాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ తో పాటు బిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ ధ్యాస మధుసూదన్ రెడ్డి, శాతవాహన విశ్వవిద్యాలయం బిఆర్ఎస్వి ఇంచార్జ్ చుక్క శ్రీనివాస్, నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, రాష్ట్ర నాయకులు పటేల్ శ్రవణ్ రెడ్డి, ఆరే రవి గౌడ్ , సోమిరెడ్డి రాజా నరేష్ రెడ్డి, పొన్నం శ్రీకాంత్ గౌడ్, రవి నాయక్ మున్నా, ఎల శేఖర్ బాబు , విక్రమ్, పటేల్ సుధీర్ రెడ్డి, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, మాడిశెట్టి అజయ్, వినోద్, దినేష్, నరేష్ , తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ జూనియర్ కాలేజెస్ చుం-చం ఫ్రెషర్స్ డే సంబరాలు

## ● ఐఐటిల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం






**కరీంనగర్ టౌన్, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):** విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా కష్టపడి నెరవేర్చాలని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని చొప్పదండి శాసనసభ్యులు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్. వి.నరేందర్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతో సమాజంలో చాలా గొప్ప గుర్తింపు పొందగలుగుతామని సమయాన్ని వృధా చేయకుండా చదువులో పట్టు సాధించి అగ్రస్థానంలో నిలవాలని వారు చెప్పారు. విద్యార్థులు ఎవరైతే అగ్రస్థానంలో ఉంటారో వారికి భవిష్యత్తులో అవకాశాలు చాలా పుష్కలంగా ఉంటాయని తెలిపారు. ఎంతోమంది ప్రముఖులు చదువుతో ఖ్యాతి చెందారని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని ప్రత్యేకంగా వారు విద్యారంగంపై దృష్టి సారించడం చాలా గొప్ప విషయమని వారు చెప్పారు. విద్యారంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుడుతూ అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారని వారు చెప్పారు. మన తెలంగాణ రాష్ట్రంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల యొక్క పాత్ర చాలా ప్రశంసనీయమైనదని, విద్యార్థులకు నమ్మశక్యము గానీ ఫలితాలను సాధించి దిక్సూచి గా నిలుస్తున్నదని కొనియాడారు. నరేందర్ రెడ్డి చేస్తున్నటువంటి కృషి చాలా ఆదర్శనీయమైనదని మరియు వారు అవలంబిస్తున్నటువంటి విద్యా విధానాలు చాలా చాలా గొప్పవాని కొనియాడారు. డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు గత 36 సంవత్సరాలుగా తరగని ఉత్సాహంతో ఘన విజయాలే లక్ష్యంగా ముందుకు పయనిస్తూ సమాజంలో అగ్రస్థానంలో నిలుస్తున్నామని వారు చెప్పారు. విద్యార్థుల సైతం అధ్యాపకుల యొక్క సూచనలను పాటిస్తూ చాలా గొప్ప ఫలితాలు సాధిస్తున్నారని గుర్తు చేశారు. అదే విధంగా ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 109 మంది విద్యార్థులు భారతదేశ ప్రఖ్యాత ఐఐటీలలో ఎన్ఐటీలలో ఐఐఐటిలలో సీట్లను సాధించి నూతన చరిత్రకు బీజం వేశారని వారు చెప్పారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే కాకుండా వారిలో విశ్వాసం నింపుతూ పలు పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడం మరియు విజయం సాధించడానికి ప్రోత్సాహాన్ని అందించడం జరుగుతుందని వారు చెప్పారు. వేడుకలలో భాగంగా ఐఐటీలలో ఎన్ఐటీలలో ట్రిపుల్ ఐటీలలో సీట్లు సాధించిన విద్యార్థులకు ఘనంగా సన్మానం చేశారు. వేడుకలలో భాగంగా విద్యార్థుల ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించినందుకు నరేందర్ రెడ్డి ని తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మెడికల్ బోర్డు, నియామక పత్రాల పునరుద్ధరణ ఐఎన్టీయూసీ పోరాట ఫలితం

- సింగరేణి భవిష్యత్తు పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన సంక్షేమం కోసం ఐఎన్టీయూసీ - పిఈఆర్కేఎస్ పై ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు, సొంతింటి కల సాకారం చేస్తాం. - కార్మికుల హక్కుల సాధనలో ఐఎన్టీయూసీ ముందుంది - తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్





**రామగిరి, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):-** రామగుండం ఆర్.జీ -త్రీ ఏరియాలోని ఓసీపీ-టు వద్ద ఆర్.జీ -త్రీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గెట్ మీటింగ్‌లో తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో ఐఎన్టీయూసీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. మెడికల్ బోర్డు వ్యవస్థను పునరుద్ధరించేందుకు యాజమాన్యంతో పాటు ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారం సాధించిన ఘనత ఐఎన్టీయూసీ కే దక్కుతుందన్నారు. గుర్తింపు సంఘం వైఫల్యం కారణంగా నిలిచిపోయిన నియామక పత్రాల పంపిణీని కూడా ప్రభుత్వ స్థాయిలో ప్రస్తావించి పునఃప్రారంభించేందుకు కృషి చేసినది ఐఎన్టీయూసీ నే అని తెలిపారు.వచ్చే ఆర్థిక సంవత్సరంలోపు పిఈఆర్కేఎస్ పై విధిస్తున్న ఆదాయపు పన్ను రద్దు కోసం ఐఎన్టీయూసీ పోరాటం కొనసాగిస్తుందని, మారు పేర్ల మార్పు సమస్య పరిష్కారం కోసం యూనియన్--యాజమాన్య సంయుక్త కమిటీకి ఇప్పటికే ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. కార్మికుల సొంత ఇంటి కలను కూడా కచ్చితంగా సాకారం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మాజీ బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. ఏంఏండిఆర్ చట్టానికి మద్దతు, బొగ్గు గనుల వేలం ప్రక్రియలో సింగరేణికి జరిగిన నష్టం, రాష్ట్ర ప్రభుత్వ బకాయిలు, కేసీఆర్ ఇచ్చిన హామీల అమలు వంటి అంశాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కోయగూడెం బ్లాక్, సత్తుపల్లి బ్లాక్ వంటి విలువైన బొగ్గు గనులు సింగరేణికి దక్కకుండా పోవడం వల్ల సంస్థకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందన్నారు.అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిపెండెంట్ ఉద్యోగాల వయోపరిమితి 35 నుండి 40 సంవత్సరాలకు పెంపు, శాశ్వత కార్మికులకు రూ.1 కోటి ప్రమాద బీమా, కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల బీమా, లాభాల వాటా, బీసీ లైజనింగ్ అధికారుల నియామకం, సోలార్ మరియు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల విస్తరణ, హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు ప్రక్రియ వంటి పలు చారిత్రాత్మక నిర్ణయాలు అమలులోకి వచ్చాయని పేర్కొన్నారు.సింగరేణి భవిష్యత్తు పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన సంక్షేమం కోసం ఐఎన్టీయూసీ నిరంతరం పోరాడుతుందని, కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం ఐఎన్టీయూసీ ద్వారానే సాధ్యమవుతుందని డా. బి. జనక్ ప్రసాద్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహారెడ్డి, ధర్మపురి, వైస్ ప్రెసిడెంట్ దాస్, సెక్రటరీలు గడ్డం తిరుపతి యాదవ్, రామారావు, ఉయ్యాల కుమారస్వామి, పిట్ సెక్రటరీలు రామిడ్ల మనోహర్, కె ఎన్ చారి, రాజ్‌కుమార్, కేంద్ర, బ్రాంచ్ పిట్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

## ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించాలి: ఎస్ఎఫ్ఐ




**నల్గొండ ప్రతినిధి, జూన్ 22 (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధికంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని, మౌలిక వసతులను మెరుగుపరచాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేయడం వల్ల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యను వ్యాపారంగా మార్చకుండా ప్రభుత్వం కఠిన నియంత్రణ చర్యలు చేపట్టి ఫీజుల నియంత్రణకు ప్రత్యేక విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఎస్ఎఫ్ఐ నాయకులు స్పష్టం చేశారు.

# ఉట్లపల్లి గంగమ్మ తల్లి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





**మిర్యాలగూడ, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామంలో యాదవుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన శ్రీ గంగమ్మ తల్లి జాతర మహోత్సవంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, యాదవ సంఘ నాయకులతో కలిసి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఉట్లపల్లి గ్రామం నుంచి గంగమ్మ తల్లి దేవస్థానం వరకు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భక్తులు, గ్రామస్థులు సౌకర్యవంతంగా దేవస్థానానికి చేరుకునేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగపడు తుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి రాజీ లేకుండా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యాదవ సంఘ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంట్లోకి దూసుకెళ్లిన కంటైనర్ ఆరుబయట నిద్రిస్తున్న వ్యక్తి మృతి



**నల్గొండ, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):** నల్గొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేములపల్లి మండలంలోని బుగ్గబావిగూడెం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున అదుపుతప్పిన మినీ కంటైనర్ వాహనం ఓ ఇంటిపైకి దూసుకెళ్లి విషాదానికి కారణమైంది. ఈ ప్రమాదంలో ఆరుబయట నిద్రిస్తున్న పోలేబోయిన వెంకన్న (48) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం, నార్కట్‌పల్లి- అద్దంకి ప్రధాన రహదారిపై వెళ్తున్న మినీ కంటైనర్ వాహనం ముందుగా రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అనంతరం వేగాన్ని నియంత్రించలేక నేరుగా సమీపంలోని ఇంటిపైకి దూసుకెళ్లింది. అదే సమయంలో ఇంటి ముందు ఆరుబయట నిద్రిస్తున్న వెంకన్నపై వాహనం పడటంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదం తీవ్రతకు మృతదేహం కంటైనర్ కింద నుజ్జునుజ్జు కావడంతో ఘటనను చూసిన స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక్కసారిగా జరిగిన ఈ విషాదంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు. సమాచారం అందుకున్న వేములపల్లి పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, డ్రైవర్ నిర్లక్ష్యం, నిద్రమత్తు లేదా వాహనంలోని సాంకేతిక లోపం కారణమా అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో బుగ్గబావిగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఇందిరమ్మ ఇళ్లతో శాశ్వత నివాసాలు

## ● ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



**కరీంనగర్ టౌన్, జూన్22(ది క్రైమ్ న్యూస్):** సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా శాశ్వత నివాసాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. సోమవారం బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు గృహ సదుపాయం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలు శాశ్వత నివాసాలు పొందే అవకాశం కలుగుతుందని చెప్పారు. పేద ప్రజలకు గృహ సదుపాయం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో ఎన్నో కుటుంబాలు సొంత ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వారికి శాశ్వత నివాస సౌకర్యం కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని, లబ్ధిదారులు మంజూరు అయిన ఇళ్లను త్వరితగతిన నిర్మించుకుని కుటుంబాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన గృహ నిర్మాణం చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పేదల గృహ అవసరాల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, అర్హులైన ఒక్క లబ్ధిదారుడు కూడా నష్టపోకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి మండల అభివృద్ధి అధికారి కె.ప్రవీణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, ఎఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# కాలమైతలేదు... కాలువ నీళ్లు ఇత్తరా? వాన జాడ లేదు.. సాగు ఎలా?

## ● రైతన్న గుండెల్లో గుబులు! ● ఎస్ఆర్ఎస్పి కాలువపైనే ఆశలు! ● ది క్రైమ్ న్యూస్ ప్రత్యేక కథనం...


**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో ఏ మూల చూసినా.. దుక్కులన్నీ సిద్ధం చేసుకుని విత్తనాలు విత్తి చినుకు జాడ కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తూ.. పచ్చని మొక్కలతో కలకలలాడాల్సిన భూములన్నీ ఎడారుల్లా కనిపిస్తున్నాయి. విత్తనాలు నాటుకున్న రైతన్నలు తమ ప్రయత్నంగా పంటలకు బోర్లు, బావుల ద్వారా నీళ్లు పారిస్తూ పంటను మొలిపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఏవేవీ రైతులందరిని పూర్తిస్థాయిలో ఆదుకోలేవు. దీనికి పరిష్కారం వర్షం ఒక్కటే ఆధారం.

వానాకాలం వచ్చిందంటే రైతు ఇంట్లో సందడి మొదలవుతుంది. పొలాలను సిద్ధం చేసుకుని, విత్తనాలు సమకూర్చుకుని, ఆకాశం వైపు ఆశగా చూసే రైతన్నకు ఈసారి మాత్రం ఆకాశమే ఆందోళన కలిగిస్తోంది. “ఈ ఏడాది వర్షాలు సాధారణం కంటే తక్కువగా ఉంటాయి”, “ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండొచ్చు” మునుపెన్నడూ చూడని విధంగా కరువు పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది అంటూ వాతావరణ నిపుణులు హెచ్చరిస్తుండటంతో రైతుల గుండెల్లో భయం మొదలైంది.

వానాకాలం ప్రారంభమై దాదాపు నెల రోజులు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. రోహిణి, మృగశిర కార్తెలు ముగిసి ఆరుద్ర కార్తె ప్రారంభమైనా చినుకు జాడ కనిపించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వరి సాగుపైనే ఆధారపడిన రైతులు “ఈసారి నాట్లు ఎలా వేయాలి?” అనే ప్రశ్నతో సతమతమవుతున్నారు.

గత యాసంగి సీజన్‌ను గుర్తు చేసుకుంటే రైతుల కష్టాలు ఇంకా కళ్లముందే కనిపిస్తున్నాయి. వానాకాలం వరి కోతల సమయంలో మొంథా తుఫాన్ ప్రభావంతో పాటు ఎస్సారెస్పీ కాలువల ద్వారా వచ్చిన నీరు అనేక ప్రాంతాల్లో రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. కోతకు సిద్ధంగా ఉన్న పొలాల్లో నీరు చేరడంతో పనులు ఆలస్యమయ్యాయి. యాసంగి పంట చివరి దశలో మాత్రం కాలువ నీళ్లు సరిపోయేటంత అందకపోవడంతో రైతులు మళ్లీ నీటి కొరతను ఎదుర్కొన్నారు.

నీళ్లు అవసరం లేని సమయంలో పుష్కలంగా రావడం, అవసరమైన సమయంలో అందకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. అయినప్పటికీ ఎలాగోలా యాసంగి పంటను పూర్తి చేసిన రైతన్నలకు ఇప్పుడు వానాకాలం కొత్త పరీక్షగా మారింది. ప్రస్తుతం గ్రామాల్లో, రైతు వేదికల వద్ద, చౌరస్తాల్లో ఒకటే చర్చ వినిపిస్తోంది... “వర్షాలు లేకపోతే కాలువ నీళ్లు ఇస్తారా?” అని. ఇప్పటికే చెరువులు అడుగంటిపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల బోర్లు, బావుల్లో కూడా నీటి లభ్యత తగ్గిపోయింది.




అనేక ప్రాంతాల్లో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎస్సారెస్పీ జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని రైతుల అవసరాలకు అనుగుణంగా విడుదల చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. వర్షాలు ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితిలో కనీసం కాలువల ద్వారా నీరు అందిస్తే సాగును కొనసాగించ గలమని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం, తగ్గుతున్న భూగర్భ జలాలు వ్యవసాయాన్ని మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి రైతులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. నీటి నిర్వహణ, కాలువల ప్రణాళికాబద్ధ వినియోగం, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడం వంటి చర్యలు అత్యవసరంగా మారాయి. ఎందుకంటే... అల్లుడచ్చేదాకా అమాస ఆగదు అన్నట్టు.. వర్షం కోసం రైతు ఎదురు చూడగలడు... కానీ వ్యవసాయ సాగు కాలం మాత్రం ఎవరికోసం ఆగదు. అందుకే ఇప్పుడు రైతన్నల నోటి వెంట వినిపిస్తున్న ఓకే ఒక్క ప్రశ్న... “కాలమైతలేదు... కాలువ నీళ్లు ఇత్తరా..?”

# సింగరేణిలో ఒక కిలో బొగ్గు కూడా పక్కదారి పట్టే ఆస్కారం లేదు

## ● చెక్ పోస్టులు, భౌతిక తనిఖీలు ● అన్ని ఎంట్రీ, ఎగ్జిట్ ద్వారాల వద్ద చెకోపోస్టులు వాహనాల భౌతిక తనిఖీలు● రామగుండం -త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్






**రామగిరి, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):-** సింగరేణిలో ఒక కిలో బొగ్గు కూడా పక్కదారి పట్టే ఆస్కారం లేదని రామగుండం -త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు. సింగరేణి అత్యంత పకడ్బందీగా బొగ్గు రవాణా ప్రతి టన్ను బొగ్గు పై పటిష్ఠ పర్యవేక్షణ అత్యాధునిక సాంకేతికతతో పారదర్శక రవాణా వ్యవస్థ పై సోమవారం ప్రత్యేక ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ బొగ్గు రవాణ తదితర విషయాల గురించి ప్రత్యేక వివరాలు వెల్లడించడం జరిగింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మైనింగ్ రంగంలో 137 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక సంస్థ.దేశ ఇంధన భద్రతకు వెన్నెముకగా నిలుస్తూ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, పారిశ్రామిక వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేస్తూ జాతీయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది.ఇటీవల సింగరేణిలో బొగ్గు మాయమైందని, భారీ స్థాయిలో బొగ్గు చోరీలు జరిగాయని చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు దూరంగా ఉండటమే కాకుండా, సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయి.ఈ నేపథ్యంలో సింగరేణిలో అమలులో ఉన్న బొగ్గు రవాణా, భద్రతా వ్యవస్థలు, సాంకేతిక పర్యవేక్షణ విధానాల గురించి కొన్ని వాస్తవాలను మీతో పంచుకోవడం అవసరమని భావిస్తున్నాం. బొగ్గు రవాణా వ్యవస్థ సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా వినియోగదారులకు సరఫరా చేయబడుతోంది.బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశలో డిజిటల్ పర్యవేక్షణ, భద్రతా తనిఖీలు, ఆన్లైన్ రికార్డింగ్ వ్యవస్థలు అమల్లో ఉంటాయి.రోడ్డు మార్గం ద్వారా బొగ్గు రవాణా హైదరాబాద్ లోని మార్కెటింగ్ విభాగం ద్వారా ఎస్ఏపీ ఆధారిత వ్యవస్థలో బొగ్గు కేటాయింపులు జరుగుతాయి. ఏ వినియోగదారుడు ఏ గని నుంచి, ఎంత పరిమాణంలో, ఎప్పుడు బొగ్గు స్వీకరించాలో ముందుగానే డిజిటల్గా కేటాయించ బడుతుంది. ఈ వాహనం గని లేదా కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్పి) వద్దకు చేరిన వెంటనే: ఖాళీ వాహనం బరువును ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జిపై నమోదు చేస్తారు.వాహనం నంబర్, వినియోగదారుడి వివరాలు ఎస్ఏపి వ్యవస్థలో నమోదవుతాయి. నిర్దేశిత పరిమాణంలో బొగ్గు లోడింగ్ నిర్వహిస్తారు. అనంతరం ఆర్ఎఫ్ఐడి ఆధారిత బూమ్ బ్యారియర్లు కలిగిన వే బ్రిడ్జిల వద్ద మళ్లీ తూకం వేస్తారు. కేటాయించిన పరిమాణానికి అనుగుణంగా బొగ్గు లోడ్ అయిన తర్వాత మాత్రమే కంప్యూటర్ జనరేట్ చేసిన అధికారిక వే-బిల్ జారీ చేసి వాహనాన్ని విడుదల చేస్తారు.వాహనం బయలుదేరిన వెంటనే ఆ సమాచారం వినియోగదారుడికి, మార్కెటింగ్ విభాగానికి సంబంధిత అధికారులకు ఆన్లైన్ ద్వారా చేరుతుంది. జీపిఎస్ -జియోఫెన్సింగ్ ఆధారిత పర్యవేక్షణ బొగ్గు రవాణా చేసే వాహనాలన్నింటికీ జీపిఎస్/ జీపిఆర్ఎస్ ట్రాకింగ్ వ్యవస్థ అమలులో ఉంది. వాహనం ఎక్కడ ఉంది?ఏ మార్గంలో వెళ్తుంది? ఎక్కడ ఆగింది? గమ్యస్థానానికి చేరిందా? అనే వివరాలు రియల్టైమ్లో పర్యవేక్షించబడతాయి. జియోఫెన్సింగ్ సాంకేతికత కారణంగా వాహనం నిర్దేశిత మార్గం నుంచి మళ్లితే సంబంధిత గని మేనేజర్, ప్రాజెక్ట్ అధికారి, సెక్యూరిటీ ఆఫీసర్కు వెంటనే హెచ్చరికలు వెళ్తాయి.ఆర్ఎఫ్ఐడి -సీసీటీవీ - బూమ్ బ్యారియర్ల సమగ్ర నిఘా సింగరేణి గనులు, వెయిబ్రిడ్జ్లు, సీహెచ్పి, ఎంట్రీ-ఎగ్జిట్ గేట్లు, రైల్వే సైడింగ్లు, స్టాక్ యార్డుల వద్ద ఆర్ఎఫ్ఐడి ఆధారిత బూమ్ బ్యారియర్లు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయబడ్డాయి. వందలాది సీసీటీవీ కెమెరాలు 24 గంటలూ పనిచేస్తూ ప్రతి కదలికను రికార్డు చేస్తున్నాయి. సింగరేణిలోని అన్ని వెయిబ్రిడ్ కోల్ నెట్ డిజిటల్ వ్యవస్థకు అనుసంధానించబడ్డాయి. ప్రతి లారీ, ప్రతి వ్యాగన్ బరువు ఆన్లైన్లో నమోదు అవుతుంది.లోడింగ్ పాయింట్ వద్ద నమోదైన బరువు ఆన్లోడింగ్ సమయంలో నమోదైన బరువుతో సరిపోల్చబడుతుంది. ఏదైనా తేడా ఉంటే సంబంధిత రవాణా కాంట్రాక్టర్ నుంచి నష్టపరిహారం వసూలు చేయబడుతుంది.చెక్ పోస్టులు- భౌతిక తనిఖీలు అన్ని ఎంట్రీ, ఎగ్జిట్ ద్వారాల వద్ద చెకోపోస్టులు. వాహనాల భౌతిక తనిఖీలు. హోలోగ్రామ్ కలిగిన అధికారిక చలానాలు. రైలు మార్గం ద్వారా బొగ్గు రవాణా ఫ్యూయల్ సప్లై అగ్రిమెంట్ల (ఎఫ్ ఎస్ ఏ ) ప్రకారం విద్యుత్ కేంద్రాలు ఇతర భారీ వినియోగదారులు సింగరేణి వివిధ సీహెచ్పి నుంచి బొగ్గు స్వీకరిస్తారు. రైల్వే శాఖ కేటాయించిన రేకుల్లో.. ప్రతి వ్యాగను నిర్దిష్ట పరిమాణంలో బొగ్గు లోడింగ్ జరుగుతుంది.మొత్తం ప్రక్రియ ఎస్ఏపి ఆధారంగా నిర్వహించబడుతుంది.లోడింగ్ పూర్తయిన వెంటనే వినియోగదారునికి డిజిటల్ సమాచారం అందుతుంది. అనంతరం రైల్వే శాఖ బొగ్గు గమ్యస్థానానికి తరలిస్తుంది.ప్రతీ రోజూ గస్తీ సింగరేణి సెక్యూరిటీతో గస్తీ ఫ్లయింగ్ స్క్వాడ్లు ఆకస్మిక తనిఖీలు చెక్ పోస్టులు, స్టాక్ యార్డులు, రవాణా మార్గాలపై సర్ప్రైజ్ రైడ్లు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నుంచి వినియోగదారుని వరకు ప్రతి టన్ను బొగ్గు ఆర్ఎఫ్ఐడి , జీపీస్ , సీసీటీవీ , కోల్ నెట్ , ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు, సింగరేణి సెక్యూరిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, హోలోగ్రామ్ చలానాలు, టాస్క్ ఫోర్స్ పర్యవేక్షణ వంటి బహుళస్థాయి సాంకేతికత, భద్రతా వ్యవస్థల మధ్య నిర్వహించ బడుతోంది.అందువల్ల బొగ్గు మాయమవడం లేదా చోరీ జరగడం వంటివి అసత్య ఆరోపణలు” ప్రతి టన్ను బొగ్గు - డిజిటల్ పర్యవేక్షణలొ ప్రతి రవాణా - భద్రతా నిఘాలో” “పారదర్శకత, బాధ్యత, సాంకేతికత- ఇవే సింగరేణి బొగ్గు నిర్వహణకు మూల సూత్రాలు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాణ్యత విభాగం రామగుండం రీజియన్ జనరల్ మేనేజర్ సుజయ్ మోజుందర్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్య నారాయణ, ఎస్వోటుజియం యం.రామ్మోహన్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షబ్బీరుద్దీన్, ఐటి మేనేజర్ ఆర్.రాజేశ్వరి, నాణ్యత విభాగాధిపతి ఆసిఫ్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రిలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం




**కరీంనగర్ టౌన్, జూన్22 (ది క్రైమ్ న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రిలో ఆదివారం యోగా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని యోగా ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రత్యేకతను వివరిస్తూ, ప్రస్తుత కాలంలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా మనసుకు ప్రశాంతత, శరీరానికి దృఢత్వం లభిస్తాయని అన్నారు. ఆసుపత్రి సిబ్బంది అందరూ క్రమం తప్పకుండా యోగా చేయాలని, ప్రజల్లో కూడా ఆరోగ్యంపై అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు,డాక్టర్ రవి కుమార్ , డాక్టర్ లోకేష్ (ఫిజీషియన్), ఆచార్య బి. రామకృష్ణ గౌడ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, హెచ్ఆర్ ఈశ్వర్ ,దాసరి చంద్రశేఖర్ ,నర్సింగ్ సిబ్బంది.

# డ్రగ్స్‌కి విదార్థులు దూరంగా ఉండాలి

**- బేగంపేట్ ప్రభుత్వ పాఠశాలలో యాంటీ డ్రగ్స్ పై విదార్థులకు అవగాహన - రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్**




**రామగిరి, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):-** విద్యార్థులు డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని, బాగా చదువుకొని భవిషత్తు లో గొప్ప స్థాయికి చేరుకోవాలని రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం రామగిరి పోలీస్ స్టేషన్ పరిధి బేగంపేట్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాంటీ డ్రగ్స్ పై విదార్థులకు అవగాహన కల్పించారు. జీవితాల్లో డ్రగ్స్ ఎలా ప్రభావితం చేస్తాయో చెప్పి వాటికి దూరంగా ఉండాలని, విద్యాసంస్థల్లోకి అటువంటి ప్రభావం పడకుండా చూడాలనీ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై తాడవేని శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల విద్యార్థుల బంగారు భవిష్యత్ దెబ్బతింటుందని, కేసులతో ఇబ్బందులు పడడమే కాకుండా ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని, సమాజంలో మనకున్న సంబంధాలు మొత్తం కట్ అయిపోతాయని తెలిపారు.డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు,ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు.చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని కాబట్టి విద్యార్థులు అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాల బరువు కంటే.. ఫీజు బిల్లుల బరువే ఎక్కువ!

**- విద్యాశాఖ అధికారుల తనిఖీలు శూన్యం - పట్టణంలో ప్రైవేట్ స్కూల్లదే ఇష్టారాజ్యం.. - మధ్యతరగతి కుటుంబాలపై ఫీజుల భారం - అపారదర్శక ఫీజులపై నియంత్రణ తీసుకురావాలి.. - ప్రైవేట్ స్కూళ్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి!**



**లక్షెట్టిపేట, జూన్ 21 (ది క్రైమ్ న్యూస్):** కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో లక్షెట్టిపేట పట్టణంలోని ప్రైవేట్ స్కూల్ ల ఫీజుల భారం తల్లిదండ్రులను తీవ్రంగా కలవరపెడుతోంది. పిల్లల భవిష్యత్తు కోసం మంచి విద్య అందించాలని ఆశించే మధ్యతరగతి కుటుంబాలు, ప్రైవేట్ విద్యాసంస్థలు విధిస్తున్న అధిక ఫీజులు, పుస్తకాల ఖర్చులు, యూనిఫాంలు, రవాణా ఛార్జీలతో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ప్రెస్టీజ్’ పేరుతో, నాణ్యమైన విద్య అందిస్తామనే హామీలతో ప్రైవేట్ స్కూల్లు భారీ మొత్తాలను వసూలు చేస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా పుస్తకాలు, నోట్బుక్స్, స్టడీ మెటీరియల్ను స్కూల్ల ద్వారానే కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తూ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఒకే తరగతి విద్యార్థికి పుస్తకాలకే రూ.8 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చు అవుతోందని, అదనంగా ఫీజులు, ఇతర చార్జీలు కలిపి లక్ష రూపాయల వరకు భారం పడుతోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. దీంతో పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు కూడా నెలకొంటున్నాయి. ఇక విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ స్కూల్ ఫీజుల వ్యవహారంపై పర్యవేక్షణ చేయడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మార్గదర్శకాలు ఉన్నప్పటికీ వాటి అమలుపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. లక్షెట్టిపేట లో ప్రైవేట్ స్కూల్ ఫీజులు , పుస్తకాల విక్రయాలు, అదనపు వసూళ్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని విద్యాశాఖ అధికారులతో కలిసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రజల డిమాండ్ ఇదే.. ప్రైవేట్ స్కూల్ ఫీజులపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలి. పుస్తకాల విక్రయాల్లో అక్రమాలపై విచారణ చేపట్టాలి. అదనపు ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి. జిల్లా స్థాయిలో ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. “విద్యను వ్యాపారంగా కాకుండా సేవగా చూడాలి. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి” అని లక్షెట్టిపేట ప్రజలు కోరుతున్నారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**● జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీ మల్ల సుధాకర్**




**రామగిరి,జూన్ 22(ది క్రైమ్ న్యూస్):** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి అని కమాన్ పూర్ మండలం గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాశీ మల్ల సుధాకర్ అన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల (గుండారం)లో యాంటీ డ్రగ్ అవగాహన నిర్వహించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కాశిమల్ల సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కాశిమల్ల సుధాకర్ మాట్లాడుతూ, నేటి యువత దేశ భవిష్యత్తు అని, విద్యార్థులు తమ లక్ష్యాల సాధనలో ఏకాగ్రతతో ముందుకు సాగాలని సూచించారు. డ్రగ్స్, మాదకద్రవ్యాలు క్షణిక ఆనందాన్ని కలిగించినప్పటికీ, అవి వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు చదువుపై ఆసక్తి తగ్గిపోతుందని, భవిష్యత్తు అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని వివరించారు.విద్యార్థులు సోషల్ మీడియా, చెడు స్నేహాల ప్రభావానికి లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాల వినియోగానికి ప్రోత్సహించే వారిని గమనిస్తే వెంటనే అధ్యాపకులకు, తల్లిదండ్రులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని, క్రీడలు, పుస్తక పఠనం, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కమాన్పూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ ఖలీల్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, వినియోగం చట్టరీత్యా నేరమని తెలిపారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేందుకు పోలీసులు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎవరైనా డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని గుర్తిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.హెడ్ కానిస్టేబుల్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకోవాలని, ఒత్తిడులు లేదా సమస్యలు ఎదురైనప్పుడు మాదకద్రవ్యాల వైపు మళ్లకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడాలని సూచించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యవంతమైన, విజయవంతమైన జీవితాన్ని నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఖలీల్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్ బాబు, కానిస్టేబుళ్లు దాసి సతీష్, శ్రీనాథ్, జాహ్నవి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఒసిపి-టు నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న భరత్ కుమార్‌కి టీబీజీకేఎస్ ఘన సన్మానం






**రామగిరి, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):** రామగుండం ఆర్.జీ-త్రీ ఏరియా లోని ఒసిపి-టు టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీ వేముల రవిశంకర్, బేస్ వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ చిప్ప సురేష్ ఆధ్వర్యంలో ఓసిపి-టు మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించబోతున్న భరత్ కుమార్ కి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం స్వాగత శుభాకాంక్షలు తెలిపిన్నారు.ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ కంపెనీ అభివృద్ధి కోసం, క్వారీలో పని స్థలాల మెరుగుపరుచుట కొరకు, రక్షణతో కూడిన ఉత్పత్తి కై కార్మికుల సంక్షేమం కోసం యాజమాన్యం కార్మిక సంఘాలు కార్మికులు సుహృద్భావ వాతావరణంలో కంపెనీ మనందరిది అనే భావన తో అందరం కలిసికట్టుగా పనిచేసి రాబోయే రోజుల్లో ఓసీటును సింగరేణిలో బెస్ట్ ప్రొడక్షన్ కలిగిన మైన్ గా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నాగెల్లి సాంబయ్య మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో గుర్తింపు సంఘం గా ఉన్నటువంటి మా సంఘం యాజమాన్యంతో కలిసి రక్షణతో కూడిన ఉత్పత్తితో పాటు సింగరేణి కంపెనీ అభివృద్ధి పథంలో నడిచేవిధంగా కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట వేసే విధంగా ఎన్నో హక్కులను అమలుపరిచే చర్యలు తీసుకునే విధంగా యాజమాన్యంతో కలిసికట్టుగా పనిచేసినటువంటి సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికి కూడా ఒక బాధ్యత కలిగిన సంఘముగా కంపెనీలో పని చేసే ఉద్యోగస్తులుగా మా బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ ఓసిపి-టు గని కంపెనీ అభివృద్ధి కోసం మా సహాయ సహకారాలు ఎప్పుడూ యాజమాన్యానికి అందిస్తామని అదేవిధంగా కార్మికుల సంక్షేమం కొరకు కార్మికుల పని స్థలాల మెరుగుకై ఎప్పటికీ ముందుంటామని తెలియజేశారు. అలాగే ఈనెల 30 తారీఖున పదవీ విరమణ పొందుతున్న ఓసిపి టు మేనేజర్ రామా రావు కి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు దేవ శ్రీనివాస్, పాశం శ్రీనివాస్ రెడ్డి వీరబోని సంతోష్ ఊరేడి రమేష్ ప్రదీప్ రావు శేషగిరి రావు, షిఫ్ట్ ఇంచార్జి బర్ల సుధాకర్, మరియు కుమ్మరి కుంట వెంకటేష్ జగన్ నాయక్ మోసం రమేష్ చిప్ప సదన్ సంపత్ శ్రీనివాస్ మనోహర్ సత్యనారాయణ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల సేవల కొరకే లైన్స్ క్లబ్ పని చేయాలి

**- ఫాస్టెస్ట్ గవర్నర్ డాక్టర్ విజయ - నాలుగోసారి ఏకగ్రీవంగా లైన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి - ప్రధాన కార్యదర్శిగా నల్లవెల్లి శంకర్**




**రామగిరి, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):** బీద పేద ప్రజల సేవ కొరకే లైన్స్ క్లబ్ పని చేయాలి అని లైన్స్ క్లబ్ ఫాస్టెస్ట్ గవర్నర్ డాక్టర్ విజయ అన్నారు. సోమవారం నూతన ఎన్నికైన కమాన్ పూర్ లైన్స్ క్లబ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లైన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ నాలుగోసారి ఏకగ్రీవంగా లైన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నల్లవెల్లి శంకర్, కోశాధికారిగా డాక్టర్ విజయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. కార్యక్రమానికి ఇన్స్టాలేషన్ ఆఫీసర్గా డాక్టర్ విజయ రేకులపల్లి ఫాస్టెస్ట్ గవర్నర్ వచ్చి ప్రమాణస్వీకారం చేయించినారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ ఇంటర్నేషనల్ అంటేనే పేద వర్గాల అభ్యున్నత కొరకు పేదలకు సేవ కొరకే అని ఈ సందర్భంగా వారు అన్నారు లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న కమాన్ పూర్ లయన్స్ క్లబ్ ను ఈ సందర్భంగా వారు అభినందించినారు లయన్స్ క్లబ్ కరోనా సమయంలో మరియు అనేక విపత్త లకు ముందుండి సహాయ సహకారాలు అందించింది లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అన్నారు .ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్పర్సన్ సోమారపు లావణ్య జోనల్ చైర్పర్సన్ డాక్టర్ లక్ష్మీవాని కమాన్ పూర్ లయన్స్ క్లబ్ సభ్యులు చౌదవరపు లింగమూర్తి ,బొజ్జ రాజాసాగర్, సోప్పరి సంతోష్ కుమార్, జబ్బార్ ఖాన్, బండసాయి శంకర్, లగీ చెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# శుభ్రత పాటించని రెస్టారెంట్లలో తనిఖీలు

**- కొరడా ఝులిపించిన నగర పాలక ప్రజారోగ్య విభాగం**

**- దసరా దావత్, అన్ లిమిటెడ్, బేకర్స్ డిలైట్ షాపులకు జరిమానా**



**గోదావరిఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** శుభ్రత లేని పరిస్థితుల్లో ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదేశాలననుసరించి ప్రజారోగ్య విభాగం అధికారులు సోమవారం నగరంలోని వివిధ బేకరీలు, రెస్టారెంట్ లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దసరా దావత్ కిచెన్, అన్ లిమిటెడ్, బేకర్స్ డిలైట్ షాపులకు రూ 2,000/- చొప్పున జరిమానా విధించారు. ఈ తనిఖీలలో నగర పాలక సంస్థ శానిటరీ ఇన్స్పెక్టర్లు సంపత్ కుమార్, నాగ భూషణం, వార్డు ఆఫీసర్ రామకృష్ణ, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి రైతుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరిస్తాం

**మంథని ఆర్డీవో కాసబోయిన సురేష్**

**రామగిరి, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రామగిరి ఖిల్లా పరిధిలోని మేడిపల్లి రైతుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని మంథని ఆర్డీఓ కాసబోయిన సురేష్ అన్నారు. రామగిరి మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రైతులతో ఆయన సమావేశం అయ్యారు. ఇండస్ట్రియల్ పార్క్ కింద 200 ఎకరాలు సేకరించడం దాదాపుగా పూర్తి చేయడం జరిగిందన్నారు. బావులు, ఇతర కట్టడాలకు త్వరలో నిధులు రైతుల అకౌంట్ లలో వేస్తామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పర్నంది సుమన్, డిప్యూటీ తహసీల్దార్ యజ్ఞంబట్ల మానస, ఆర్ఐ మహేష్, జిపిఏ పేరుక వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

**- 26న పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు**

**- కొలిపాక సారయ్య, టిపియూఎస్, జిల్లా అధ్యక్షులు పిలుపు**



**రామగిరి, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):-** తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం (టిపియుఎస్) ఆధ్వర్యంలో ఈనెల 26న శుక్రవారం ప్రభుత్వ సెలవుదినం రోజున హైదరాబాదులోని ఎల్బీనగర్ స్వకులశాలి సమాజ భవనంలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు జిల్లాలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, సింగరేణి, ఎన్టిపిసి, అల్ట్రాటెక్, ఆర్టీసీ, ఎన్పిడిసిఎల్, అన్ని జాతీయ బ్యాంకులు, ఎల్ఐసి తదితర పబ్లిక్ సెక్టార్ సంస్థలలో పనిచేస్తున్న పద్మశాలి ఉద్యోగులందరూ అధిక సంఖ్యలో హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని టిపియూఎస్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు కొనిపాక సారయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వేంకటేశ్వర్లు రాష్ట్ర సదస్సు కోసం అందజేసిన చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సదస్సులో టిపియుఎస్ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ, పద్మశాలి ఉద్యోగుల సమస్యలు మొదలైన అంశాలను చర్చించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ అసోసియేట్ ప్రెసిడెంట్ గౌడ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు తాటికొండ శంకర్, ప్రచార కార్యదర్శి పెండెం సత్యనారాయణ, ప్రాథమిక సభ్యులు ఆడెపు రవికుమార్, బండారి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మన కళాశాల గుండారం సిడి ఆవిష్కరణ

**- కళాశాల ప్రిన్సిపాల్ కాశీ మల్ల**

**రామగిరి, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):-** కమాన్ పూర్ మండలంలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మన కళాశాల గుండారం సీడీని మధ్యాహ్నం ఒంటిగంటకు ఆవిష్కరించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ కాశీ మల్ల పేర్కొన్నారు. ఈ సీడీలో గుండారం లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల లో గల వసతులు, విద్యా బోధన, ఉత్తీర్ణత శాతం , ల్యాబ్, వంటి సౌకర్యాలపై తీసిన సిడిని ఆవిష్కరించనున్నారు. సీనియర్ జర్నలిస్టు జబ్బార్ ఖాన్ ఆధ్వర్యంలో కురుమ శ్రీనివాస్ కెమెరామెన్ గా పనిచేయగా వ్యాఖ్యాతగా ప్రముఖ యాంకర్ న్యూస్ రీడర్ మేజిక్ రాజా చేయగా చంద్రపాల్ ఆధ్వర్యంలో ఎడిటింగ్ చేశారు. ఈ సి డి ఆవిష్కరణ గాను ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్, స్థానిక సర్పంచ్ జంగిలి పోచాలు, లైన్స్ క్లబ్ చైర్మన్ సాన రామకృష్ణారెడ్డి తదితరులు హాజరవుతారు.

# ఘనంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం

**- నూతన అధ్యక్షురాలిగా డా. శరణ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా బుద్యార్థి బుచ్చన్న, కార్యదర్శిగా కాటం సత్యం, కోశాధికారిగా టి.వి. సురేష్ బాబు**



**రామగిరి, జూన్ 22(ది క్రైమ్ న్యూస్):-** లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సెంటినరీ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, క్లబ్ ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా విచ్చేసిన జిల్లా మాజీ గవర్నర్ లయన్ డా. విజయ రేకులపల్లి నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షురాలిగా డా.శరణ్య యాదవ్, కార్యదర్శిగా కాటం సత్యం, కోశాధికారిగా టి.వి. సురేష్ బాబు, ఉపాధ్యక్షుడిగా బుద్యార్థి బుచ్చన్నతో పాటు వివిధ చైర్ పర్సన్‌లు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డా.విజయ రేకులపల్లి మాట్లాడుతూ గత పాలకవర్గం సేవాకార్యక్రమాల్లో విశేషకృషి చేసిందని, ఒకేసంవత్సరంలో 165సేవా కార్యక్రమాలను నిర్వహించి 7,539 మంది లబ్ధిదారులకు సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. ఇదే సేవా స్ఫూర్తితో నూతన పాలకవర్గం మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గత సంవత్సరంలో నేత్రదానం చేసిన 22 మంది నేత్రదాతల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అలాగే 14 మంది నూతన సభ్యులను లయన్స్ క్లబ్‌లోకి ఆహ్వానించి సభ్యత్వ పత్రాలను అందజేశారు. నూతన అధ్యక్షురాలు డా.శరణ్య యాదవ్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి క్లబ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.గతపాలకవర్గం చూపిన సేవామార్గంలో ముందుకు సాగుతూ, విద్య, వైద్యం, పర్యావరణం, మానవతా సేవా కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యత ఇస్తూ క్లబ్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జి.ఎస్.టి కోఆర్డినేటర్ సాదుల వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటరీ రామకిషన్, రీజనల్ చైర్మన్ కావేటి రాజగోపాల్, జోనల్ చైర్మన్ భాస్కర్ రావు, వేల్పుల రమేష్, సెంటినరీకాలనీ లయన్స్ క్లబ్ చైర్ పర్సన్‌లు,మహిళా చైర్ పర్సన్‌లు, సభ్యులు మరియు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ర్యాంకులతో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులందరికీ ఫీజు రీయంబర్స్మెంట్ ఇవ్వాలి

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**



**నల్గొండ జిల్లా ప్రతినిధి జూన్ 22 (ది క్రైమ్ న్యూస్):** ర్యాంకులతో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులందరికీ పూర్తి స్థాయిలో ఫీజు రీయంబర్స్మెంట్ అందించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థులకు మాత్రమే ప్రత్యేకంగా పదివేల లోపు ర్యాంక్ నిబంధన విధించడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ఇతర వర్గాల విద్యార్థులకు లేని ఈ నిబంధనను కేవలం బీసీలకు వర్తింపజేయడం వల్ల విద్యా అవకాశాలు దెబ్బతింటున్నాయని అన్నారు. పదివేల లోపు ర్యాంక్ నిబంధన కారణంగా అనేక మంది బీసీ విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలల్లో ప్రవేశాలు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి, ర్యాంకులతో సంబంధం లేకుండా అర్హులైన బీసీ విద్యార్థులందరికీ పూర్తి ఫీజు రీయంబర్స్మెంట్ మంజూరు చేయాలని లింగం గౌడ్ కోరారు. బీసీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పదివేల ర్యాంక్ నిబంధనను వెంటనే రద్దు చేసి సమాన విద్యా అవకాశాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# రైతు వేదికల్లో విత్తన మేళా ప్రారంభం..

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తులు ఒకే వేదికపై అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో విత్తన మేళాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విత్తన మేళాలో వరి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము, సోయాబీన్ తదితర పంటల విత్తనాలతో పాటు కూరగాయల విత్తనాలు, సూక్ష్మ పోషకాలు, నానో యూరియా, నానో డీఏపీ వంటి వ్యవసాయ ఉత్పత్తులు రైతులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రైతులు తమకు అవసరమైన విత్తనాలను నేరుగా కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు వ్యవసాయ నిపుణుల నుంచి పంటల సాగుపై సలహాలు పొందవచ్చని తెలిపారు. రానున్న వానాకాల సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. విత్తనాల నాణ్యత, సరైన పంట ఎంపిక, ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించడం ద్వారా రైతుల దిగుబడులు పెంచడమే ఈ మేళా ప్రధాన ఉద్దేశమని అధికారులు వెల్లడించారు.

# విద్యుత్ ఉద్యోగులపై నిరాధార ఆరోపణలు సరికావు

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఓ విద్యుత్ వినియోగదారు గత కొంతకాలంగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖ నిబంధనల మేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు విజిలెన్స్ విభాగం అధికారులు నిర్వహించిన తనిఖీల సందర్భంగా సంబంధిత వినియోగదారుడి విద్యుత్ సర్వీస్ కనెక్షన్‌ను నిలిపివేశారు ఈ చర్యకు జగిత్యాల ఏడీఈ జవహర్లాల్ నాయక్ వ్యక్తిగతంగా కారణమంటూ కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఏడీఈ జవహర్లాల్ నాయక్ స్పష్టం చేశారు. శాఖ నిబంధనలు, బకాయిల వివరాల ఆధారంగానే చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఏడీఈ జవహర్లాల్ నాయక్‌పై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని విద్యుత్ శాఖ ఉద్యోగులు, సంఘం నాయకులు నునావత్ రామ్‌జీ తదితరులు తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో భాగంగా తీసుకునే అధికారిక చర్యలను వ్యక్తిగత కోణంలో చిత్రీకరించడం బాధాకరమని వారు పేర్కొన్నారు. ఇలాంటి నిరాధార ఆరోపణలు క్షేత్రస్థాయిలో పనిచేసే విద్యుత్ ఉద్యోగుల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు నిరంతరం విద్యుత్ సేవలు అందించేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ఉద్యోగుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అసత్య ప్రచారాలతో ఉద్యోగుల ప్రతిష్ఠను దెబ్బతీయడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు..

# విశ్వజి



## నానబెట్టిన బాదం తింటే ఈ సమస్యలకు మంచి రిలీఫ్..!!

బాదం ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. బాదంలో ఉండే పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. శక్తిని అందిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ ను నిరోధిస్తుంది. బాదంలో అనేక రకాలైన విటమిన్లు లభ్యం అవుతాయి. నానబెట్టిన బాదం తినటం ద్వారా మధుమేహం నియంత్రణతో పాటుగా రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఫలితంగా దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం కలుగుతుంది. అయితే, బాదం పరిమితంగానే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బాదం ఆరోగ్య పరంగా మేలు చేస్తుంది. బాదం ఎప్పుడూ నానబెట్టిన తర్వాత, ఖాళీ కడుపుతో తినాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో నోటి లోపల చాలా ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా ఉంటుంది. ఇది బాదంను జీర్ణం చేయడంలో, ప్రయోజనాన్ని పొందడంలో సహాయపడుతుంది. ఒక రోజులో 20 నుండి 30 గ్రాముల బాదం గింజలను తినవచ్చునని చెబుతున్నారు. బాదం పప్పు తినడం వల్ల ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ఆరోగ్యకరమైన కొవ్వు, మెగ్నీషియం, మాంగనీస్, విటమిన్ 2, భాస్వరం, రాగి లభిస్తాయి. ఇవి మెదడు, కండరాలు, కడుపు మరియు గుండెకు ప్రయోజనకరంగా ఉంటాయి. బాదంలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. అవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి పనిచేస్తాయి. ఈ ఒత్తిడి కణాలను దెబ్బతీస్తుంది. దాదాపు అన్ని దీర్ఘకాలిక వ్యాధుల అభివృద్ధిలో పాత్ర పోషిస్తుంది. ఇది కొవ్వులో కరిగే విటమిన్, ఇది జుట్టు, చర్మం, కండరాలకు చాలా అవసరం. కణాల నిర్మాణానికి ఇది చాలా ముఖ్యమైనది. మధుమేహం నియంత్రించడానికి ఇది ఒక గొప్ప మార్గం. ఇందులో ఫైబర్ ఉంటుంది. రక్తంలో షుగర్ లెవల్స్ ఆకస్మికంగా పెరగకుండా నిరోధిస్తుంది. రక్తపోటును నియంత్రించే మెగ్నీషియం సైతం బాదంలో పుష్కలంగా ఉంటుంది. కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. కానీ బాదం కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అయితే, వైద్యులు నిర్దేశించిన మొత్తంలో నాన బెట్టిన బాదం తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

## మొటిమలు మాయం

జిడ్డు చర్మం ఉన్నవారికి మొటిమలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. రోజులో నాలుగైదుసార్లు చల్లటి నీటితో ముఖం శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఉదయం, సాయంత్రం రోజ్‌వాటర్‌తో ముఖం కడుక్కుంటే మొటిమల తీవ్రత తగ్గుతుంది. నూనె వంటకాలు మొటిమలకు కారణం అవుతాయి. రెగ్యులర్ డైట్‌లో నూనె శాతం తగ్గించాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. నీళ్లు సమృద్ధిగా తాగాలి. రెగ్యులర్‌గా పండ్ల రసాలు తీసుకోవాలి. డిప్రెషన్‌లో ఉన్నవారికి సైతం మొటిమలు వచ్చే అవకాశం ఉందని పలు పరిశోధలు చెబుతున్నాయి. మానసికంగా సంతోషంగా ఉండాలి. సాలిసిలిక్ ఆయిల్, టీట్రీ ఆయిల్ కలిగిన ఫేస్‌వాష్‌లను ఉపయోగించడం వల్ల మొటిమలు తగ్గుముఖం పడతాయి. కలబంద జెల్‌తో కస్తూరి కలిపి ఫేస్‌ప్యాక్‌గా వేసుకున్నా మొటిమలను నియంత్రించవచ్చు.

## పెసల మొలకలతో ఇలా చేస్తే.. రెట్టింపు శక్తి, ఎన్నో లాభాలు...!!



ప్రతిరోజు పెసలును నానబెట్టుకుని మొలకలు చేసుకుని తినడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పెసరలో మెగ్నీషియం, పొటాషియం స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. పెసర పప్పుల్లో మన శరీరానికి అవసరమైన అమైనో ఆమ్లాలు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. అంతేకాదు వీటిలో ప్రోటీయోలైటిక్ ఎంజైమ్స్ కూడా ఉంటాయి. అలసటను పోగొట్టేందుకు, మెరుగైన నిద్రకు పెసరపప్పు ఎంతగానో సహాయపడుతుంది. ఉదయం వేళ బ్రేక్ ఫాస్ట్ వేళ వీటిని తీసుకుంటే రెట్టింపు శక్తి ఇవ్వటంతో పాటుగా ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందుతాయి. మొలకల్లో విటమిన్‌లు, మినరల్‌లు, ఫైబర్, మరియు ప్రోటీన్‌లు అధికంగా ఉంటాయి. వీటల్లో ముఖ్యంగా విటమిన్ కాంప్లెక్స్, మరియు విటమిన్ లాంటి పోషకాలు ఎక్కువగా లభిస్తాయి. మొలకలను తినడం ద్వారా జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. మొలకలు తేలికగా జీర్ణం అయ్యే ఆహారం కావడంతో, ఇబ్బంది లేకుండా జీర్ణమవుతాయి. మొలకల్లో ఉండే ఫైబర్ జీర్ణశక్తిని పెంచి, మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. మొలకల్లో ప్రోటీన్ చాలా శాతం లభిస్తుంది, ప్రత్యేకంగా పప్పులు, శెనగలు వంటి వాటి మొలకల్లో అధికంగా ప్రోటీన్ ఉంటుంది. ఇది మాంసాహారాన్ని తగ్గించి, ప్రోటీన్ అవసరాలను తేలికగా తీర్చగలగడం వలన, ఇది శాకాహారులకు మంచి ఆహారంగా ఉపయోగపడుతుంది. మొలకలు తక్కువ క్యాలరీలు కలిగి ఉంటాయి, కానీ పోషకాలు ఎక్కువ. మొలకల్లో అధికంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. మొలకల్లో ఉండే విటమిన్ శరీరాన్ని వింత రోగాల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. ఇవి శరీరంలో ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించి, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మొలకల్లో ఫైబర్ మరియు పుట్టుమటుకులాంటి పోషకాలు అధికంగా ఉండటంతో, ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. ఫలితంగా, హృదయ సంబంధిత వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా, ఈ మొలకలు రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మరియు రక్తపోటు నియంత్రణలో సహాయపడతాయి. మొలకల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఈ కారణంగా, మొలకలు మధుమేహం ఉన్న వారికి చాలా మంచివి. వీటిని తరచుగా తీసుకోవడం ద్వారా బ్లడ్ షుగర్ లెవెల్స్ క్రమంలో ఉంటాయి. మొలకలు యాంటీ-క్యాన్సర్ లక్షణాలను కలిగి ఉంటాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

## ఏ చిన్న అనారోగ్యమైనా యాంటీ బయాటిక్స్ వాడుతున్నారా? ఎంత డేంజర్ అంటే

యాంటీబయాటిక్స్ .. ప్రస్తుతం మన సమాజంలో యాంటీబయాటిక్స్ వినియోగం విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో యాంటీబయాటిక్స్ దుర్వినియోగం అనేక అనారోగ్య సమస్యలకు, ఆరోగ్య ప్రమాదాలకు కారణంగా మారుతుంది. సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్ కొనుగోలు చేసి, వాటిని ఉపయోగించడం వల్ల వారిలో యాంటీబయాటిక్స్ రెసిస్టెన్స్ పెరుగుతుంది.

యాంటీ బయాటిక్స్ విపరీతమైన వాడకం.. ఆరోగ్య ముప్పు


ఇక గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేని ఆర్ఎంపీ వైద్యులు చిన్న చిన్న అనారోగ్యాలకు చాలా ఎక్కువ డోసేజ్ యాంటీ బయాటిక్స్ ఇస్తున్నారు. ఇది కూడా వారిలో యాంటీ బయాటిక్స్ రెసిస్టెన్స్ కు కారణం అవుతుంది. దీనివల్ల భవిష్యత్తులో యాంటీబయాటిక్స్ ఉపయోగిస్తే పనిచేయని పరిస్థితి చోటు చేసుకుంటుంది. ప్రజల ఆరోగ్యానికి పెరుగుతున్న అతిపెద్ద ఆందోళన.

యాంటీ బయాటిక్స్ రెసిస్టెన్స్ వస్తే కష్టం

యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ అనేది బాక్టీరియా మార్పులు చెందినప్పుడు, మందుల ప్రభావాలకు ఇమ్యూన్‌గా మారినప్పుడు జరుగుతుంది. దీనివల్ల ఇతరత్రా వ్యాధులు సంక్రమించిన చికిత్స చేయడం కష్టం అవుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు తక్కువగా ఉండటం వల్ల యాంటీబయాటిక్స్ తో సొంత వైద్యం చేసుకుంటున్నారు. ప్రజలు తరచుగా డాక్టర్‌ను సంప్రదించకుండా స్థానిక దుకాణాల నుండి ఈ మందులను కొనుగోలుచేసి వాడడం కారణంగా భవిష్యత్తులో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

యాంటీ బయాటిక్స్ వల్ల మనకు తెలీకుండానే సైడ్ ఎఫెక్ట్స్

యాంటీ బయాటిక్స్ దుర్వినియోగం వ్యక్తులను మాత్రమే ప్రభావితం చేయదు, ఇది ప్రజా ఆరోగ్యానికి విస్తృతమైన ప్రభావాలను కలిగి ఉంటుంది. మనకు తెలియకుండానే మన




శరీరంలో వివిధ సైడ్ ఎఫెక్ట్స్ కు యాంటీబయాటిక్స్ కారణమవుతున్నాయి. అందుకే యాంటీబయాటిక్స్ ఎక్కువగా ఉపయోగించడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల వచ్చే సమస్యలను క్లిష్టంగా మారిన తర్వాత పరిష్కరించడం కష్టమవుతుంది. అందుకే యాంటీబయాటిక్స్ వినియోగం పైన, విక్రయం పై కఠినమైన నియంత్రణలు అవసరం. వైద్యులు, రోగులకు యాంటీబయాటిక్స్ తగిన విధంగా ఉపయోగించకపోవడం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన పెంచాలి. గ్రామీణ ప్రాంతాలలో నేరుగా యాంటీబయాటిక్స్ కొనుక్కునే విధానాన్ని నియంత్రించాలి. సాధ్యమైనంతవరకు ఆరోగ్య సమస్యలను నాచురల్ గానే తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి.

# మార్కెట్

## ఐపీవోకి ఆర్ఎస్‌బీ రిటైల్..

### రూ.1,500 కోట్ల నిధుల సేకరణలో సంస్థ

హైదరాబాద్ : ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ పేర్లతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా లిమిటెడ్..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తుచేసుకున్నది కూడా. ఈ ఐపీవో ద్వారా రూ.1,500 కోట్ల వరకు నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో తాజా ఈక్విటీలను జారీ చేయడంతో రూ.500 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో ప్రమోటర్లకు చెందిన 2.98 కోట్ల షేర్లను అమ్మకానికి పెట్టింది. ఇలా సేకరించిన నిధుల్లో రూ.275 కోట్లను రుణాల చెల్లింపుల కోసం, మరో రూ.118 కోట్లను నూతన స్టోర్లను ఏర్పాటు చేయడానికి వినియోగించనున్నది. ప్రస్తుతం సంస్థకు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో 22 నగరాల్లో 73 స్టోర్లను నిర్వహిస్తున్నది. సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఆర్ఎస్ బ్రదర్స్, కాంచీపురం నారాయణి సిల్క్స్, డీఏ రాయల్, వాల్యూ జోన్ హైపర్ మార్ట్ పేర్లతో అవుట్‌లెట్లను నిర్వహిస్తున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,694 కోట్ల ఆదాయంపై రూ.104.4 కోట్ల నికర లాభాన్ని గడించింది. దేశీయ రిటైల్ రంగం అంచనాలకుమించి రాణిస్తున్నదని, గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.92.6 లక్షల కోట్లుగా నమోదైంది. దీంట్లో దుస్తులు, యాక్సెసరీస్ రూ.6.90 లక్షల కోట్లుగా ఉన్నది.




## ఫాస్టాగ్ వార్షిక పాస్.. తొలిరోజు 1.4 లక్షల మంది కొనుగోలు

స్వాతంత్ర్య దినోత్సవం నుంచి దేశంలో ఫాస్టాగ్ టోల్ చెల్లింపు విధానంలో పెనుమార్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తరచూ ప్రయాణించే వారికి మరింత సులభ, చౌక హైవే ప్రయాణాన్ని కల్పించేందుకు కొత్తగా ఫాస్టాగ్ వార్షిక పాసును నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్ల కోసం ప్రవేశపెట్టిన రూ.3,000 వార్షిక హైవే టోల్ పాసు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలలోని సుమారు 1,150 టోల్ ప్లాజాల్లో %ఖీూుూఖు్ర% వార్షిక పాస్ సౌకర్యాన్ని ఎన్‌హెచ్ఏఐ విజయవంతంగా అమలు చేసింది. తొలి రోజు సాయంత్రం 7 గంటల వరకు దాదాపు 1.4 లక్షల మంది వినియోగదారులు వార్షిక పాస్‌ను కొనుగోలు చేసి యాక్టివేట్ చేసుకున్నట్లు ఎన్‌హెచ్ఏఐ వెల్లడించింది. అదేవిధంగా టోల్ ప్లాజాల్లో దాదాపు 1.39 లక్షల లావాదేవీలు నమోదైనట్లు తెలిపింది. ఈ వార్షిక పాస్ తీసుకున్న వినియోగదారులు ఎస్ఎమ్ఎస్ ద్వారా జీరో టోల్ మెసేజ్ అందుకుంటున్నట్లు ఎన్‌హెచ్ఏఐ వివరించింది.

ఎవరికి వర్తిస్తుంది?

ప్రైవేట్ కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే ఈ వార్షిక ఫాస్టాగ్ పాస్ వర్తిస్తుంది. ఎన్‌హెచ్ఏఐ నిర్వహించే జాతీయ హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలపైన టోల్ చార్జీలు చెల్లించేందుకు ఒకేసారి డబ్బు చెల్లించి ఫాస్టాగ్ వార్షిక పాసును తీసుకోవచ్చు. ఈ పథకం కింద వాహన యజమానులు ఒకేసారి రూ. 3,000 చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిపాటు ఎన్‌హెచ్ఏఐ నిర్దేశించిన జాతీయ




రహదారుల్లో 200 వరకు టోల్ ప్లాజాలను దాటవచ్చు. ఒకవేళ గరిష్ఠ పరిమితి (200 టోల్ క్రాసింగ్‌లు) ఏడాదిలోపలే ముగిసిపోతే ఆటోమేటిక్‌గా సాధారణ విధానంలోకి ఫాస్టాగ్ మారిపోయి డబ్బు చెల్లించి టోల్ దాటవలసి ఉంటుంది.

పాసు ఎలా కొనాలి?

వార్షిక ఫాస్టాగ్ పాసు కొనేందుకు వాహనదారులు తమ వాహన నంబరు, ఫాస్టాగ్ ఐడీ ఉపయోగించి రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్ఏఐ/ఎంఓఆర్‌టీహెచ్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అవ్వాలి. తమ ఫాస్టాగ్ యాక్టివ్‌గా, సక్రమంగా ఇన్‌స్టాల్ అయి ఉందో లేదో ధ్రువీకరించుకోవాలి. యూపీఐ, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ. 3,000 చెల్లించాలి. ఆగస్టు 15న పాసు యాక్టివేట్ అవుతుంది. యూజర్లకు ఎస్ఎంఎస్ ద్వారా కన్ఫర్మేషన్ మెసేజ్ అందుతుంది. ఫాస్టాగ్ వార్షిక పాసు ఇతరులకు బదిలీ కాదు. రిజిస్టర్డ్ వాహనానికి మాత్రమే పనిచేస్తుంది. అంతేగాక ఈ పాస్‌ను ఒకసారి కొనుగోలు చేస్తే మళ్లీ డబ్బు వాపసు వచ్చే అవకాశం ఉండదు. పాసు ఆటోమేటిక్‌గా రెన్యూ కాదు. దాని గడువు తీరిన తర్వాత మళ్లీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

# ఆంధ్రప్రదేశ్

## రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

### యూరియా ఎమ్మార్పీ ధరలకే అమ్మాలి

### వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరిక

అమరావతి,జూన్22 : రైతులను ఇబ్బంది పెడితే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, కంపెనీలపై కూడా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఖరీఫ్-2026 ఎరువుల లభ్యత, పంపిణీపై మంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు, ఎరువుల కంపెనీ, అసోషియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. యూరియా, డీఏపీతో కాంప్లెక్స్ ఎరువుల బలవంతపు విక్రయాలు ఆపాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులనే అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అవసరమైన మేర కన్నా అధిక ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి చెప్పారు. యూరియా సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎరువుల బుకింగ్ యాప్ నిర్వహణ సజావుగా ఉండాలన్నారు. నానో యూరియా ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సహజ వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని తెలిపారు. సాధ్యమైనంత మేర రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, అధిక ఎరువుల వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వెల్లడించారు. ఎమ్ఆర్పీ ధరకే యూరియాను విక్రయించాలని, ఎమ్ఆర్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీలర్లకు మంత్రి హెచ్చరిక జారీ చేశారు. యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండాలన్నారు. గతంలోలా అక్రమాలు, ఇబ్బందులు సృష్టిస్తే ఉపేక్షించబోమని.. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎపి

రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులు, భూ కేటాయింపులు ఎంత వేగంగా జరుగుతున్నాయో వివరించడానికి మంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక రక్షణ ప్రాజెక్ట్ కోసం కేవలం 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమిని సేకరించి అప్పగించాం. గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్‌ను కేవలం 13 నెలల రికార్డు కాలంలోనే పట్టాలెక్కించి ప్రభుత్వ స్పీడ్‌ను నిరూపించాం. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభం మాత్రమేనని, అమరావతి ఒక 'సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ. 60,000 కోట్ల నిధుల సమీకరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం.. 2028 నాటికల్లా అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ రాజకీయాల్లో ఏపీ ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ కూటమిలో ఏపీ నుంచి ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల దేశ రాజధానిలో మన రాష్ట్ర గొంతు ఎంతో బలంగా వినబడుతోందని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌ను మూడు ప్రధాన ఆర్థిక హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి లోకేష్ వివరించారు. విశాఖపట్నం ఐటీ హబ్‌గా, అమరావతి నాలెడ్జ్ హబ్ గా, రాయలసీమ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారబోతున్నాయని అన్నారు. రాజకీయాల్లో మార్పుల గురించి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో స్పష్టమైన 'జనరేషన్ షిఫ్ట్' కనిపిస్తోందని లోకేష్ అన్నారు. తాము యువతకు పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 50 శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారేనని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## సాయికృష్ణ కేసు నుంచి సుగాలీ ప్రీతి ఉదంతం వరకు

### ప్రజలను మోసం చేస్తున్న డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

### ఆయనది ద్వంద్వ వైఖరి అంటూ మండిపడ్డ అంబటి రాంబాబు

అమరావతి,జూన్22 : సాయికృష్ణ కేసు నుంచి సుగాలీ ప్రీతి ఉదంతం వరకు ప్రతి విషయంలోనూ డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ప్రజలను, బాధితులను మోసం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. ఒకవైపు ప్రభుత్వం సాయికృష్ణ కుటుంబాన్ని పిలిపించి న్యాయం చేస్తామని చెబుతుంటే.. మరోవైపు పవన్ కళ్యాణ్ ఏమో సాయికృష్ణను ఒక క్రిమినల్ అని మాట్లాడుతున్నారని అన్నారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ తీరుపై అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. అదే సమయంలో జనసేన నేత సామినేని ఉదయభాను సాయికృష్ణ తల్లిని ఓదార్చేందుకు వెళ్లి.. పవన్ కళ్యాణ్ పంపిస్తేనే వచ్చామని చెబుతున్నారు. అసలు పవన్ ఏం చెప్పాలనుకుంటున్నారో ఆయనకే తెలియాలి అని అన్నారు. వైసిపి నేతలను తాటతీస్తామంటూ పవన్ చేస్తున్న వ్యాఖ్యలపై అంబటి మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇలా మాట్లాడొచ్చా? మీ ఎమ్మెల్యే పంతం నానాజీ భాష ఎలా ఉందో చూశారా? అసలు ఎవరు గూండాలు? పవన్ గారూ.. మీరు ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏమీ చేయలేరు. మీ ఉడత ఊపులకు, సొల్లు కబుర్లకు ఇక్కడెవరూ భయపడరని స్పష్టం చేశారు. 'నేను హోంమంత్రిగా లేకపోవడం మీ అదృష్టం' అని పవన్ అనడం ద్వారా ప్రస్తుతం ఉన్న హోంమంత్రి సరిగ్గా పని చేయడం లేదని ఆయనే ఒప్పుకున్నట్లయిందని అంబటి ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్‌కు హోంమంత్రి పదవి ఇవ్వాలని తాను సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేస్తున్నానని పేర్కొన్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, ముంబై దాడుల నిందితుడు కసబ్‌ను కూడా చట్టప్రకారమే శిక్షించారని గుర్తు చేశారు. సాయికృష్ణ కేసులో ఒక అధికారి విచారణ జరుపుతుండగా హఠాత్తుగా 'సిట్' వేయడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేకనే ఈ నాటకాలు ఆడుతున్నారని, ఈ కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే సీబీఐ లేదా ఎన్ఐఏ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కోనసీమలో కాపు నేతల సమావేశంపై పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, గతంలో కులాల గురించి పవన్ మాట్లాడినట్లుగా ఈ రాష్ట్రంలో ఎవరూ మాట్లాడి ఉండరని అంబటి రాంబాబు దుయ్యబట్టారు. ఒకవైపు సాయికృష్ణ ఇంటికి జనసేన నేతలను పంపుతూ.. మరోవైపు ఈ కేసులో నిందితుడైన సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దని ఆందోళనలు చేయించడం పవన్ దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# టిటిడితో పాటు అన్ని దేవాలయాల్లో ప్రక్షాళన

### రెండేళ్లుగా వైదికంగా ముందుకు తీసుకెళ్లు ప్రయత్నం

### జగన్ పాలనలో ఆయాలను భ్రష్టు పట్టించారు

### దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



అమరావతి,జూన్22 : దేవాలయాలు సమాజంలో భాగమని, అక్కడి కార్యక్రమాలు ప్రజల్లో భాగమని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. టీటీడీతో పాటు అన్ని దేవాలయాలను ప్రక్షాళన చేయడంతో పాటు వైదికంగా ముందుకు తీసుకెళ్లడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి సూచనలు, సలహాలతో అత్యంత పవిత్రమైన ఆలోచనతో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఆధ్యాత్మిక, సనాతన పరిరక్షణ కేంద్రాలుగా అనేక ఆలయాలను తీసుకువచ్చామని తెలిపారు. రెండేళ్ల పాలన గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలనేది ముఖ్యమంత్రి అభిమతమని.. దానిలో భాగంగా వరుస కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖలో రెండు సంవత్సరాల ప్రగతిపై ఆనం మాట్లాడుతూ.. 2019-24 మధ్య రాష్ట్రంలో విచ్ఛిన్నకరమైన వాతావరణం ఉందని విమర్శించారు. దేవాలయాలు సమాజంలో భాగమనే విషయాన్ని నాడు మర్చిపోయారని మండిపడ్డారు. 2024లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభించాలని భావించినప్పుడు అప్పటికే భక్తులు, హిందూ బంధువులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రామతీర్థంలో శ్రీరామచంద్రుడి శిరచ్ఛేదం, దుర్గమ్మ క్షేత్రంలో వెండిసింహాలు మాయం, అంతర్వేదిలో రథం దగ్ధం వంటి అనేక సంఘటనలు నాడు జరిగాయని గుర్తుచేశారు. నాడు ఆ ప్రభుత్వం కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదాయం తక్కువ ఉన్న ఆలయాల్లో దీపం వెలిగించే పరిస్థితి నాడు లేదని.. దీంతో ఆయా ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రతినెలా పదివేల రూపాయలు ఇస్తున్నట్లు చెప్పారు. 692 ఆలయాల్లో పనులను ప్రారంభించామని.. కామన్ గుడ్ ఫండ్ నుంచి నిధులు సమకూర్చుతున్నామని చెప్పారు. టీటీడీ సౌలభ్యంతో రాష్ట్ర దేవాదాయ శాఖ ద్వారా భజన మందిరాలు నిర్మాణం చేయాలని నిర్ణయించామన్నారు. దేవాదాయ శాఖలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. మన మిత్రా వాట్సాప్ గ్రూప్ ద్వారా అనేక సేవలు దర్శనం, ప్రసాదాలు, వసతి కల్పన చేస్తున్నామన్నారు. అంతా ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేయడంతో భగవంతుడి పేరుతో చేసే మోసాలను చాలా వరకూ తగ్గించగలిగామని చెప్పారు. డిజిటల్ వ్యవస్థతో దేవాలయ సేవల పట్ల ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందన్నారు. ప్రభుత్వం వచ్చాక 970 ధర్మకర్తల మండలిలను నియమించామని తెలిపారు. 449 ఆలయాలకు పాలకమండలిని నియమించాలన్నారు. రాబోయే రోజుల్లో 65 ఆలయాల్లో అన్నప్రసాద వితరణకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు చెప్పారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రి దేవాలయంలో నకిలీ టికెట్ల వ్యవహారంపై అంశంపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. గతంలో సమర్పించిన నివేదికలు పూర్తిస్థాయిలో లేవని భావిస్తున్నామని, అందుకే కొత్తగా విచారణ చేపట్టాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. తప్పు చేసిన అధికారులు, బాధ్యులు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జగన్ హయాంలో ఆలయాల్లో జరిగిన అక్రమాలు, పరిపాలనా లోపాలపై కూడా సమగ్రంగా పరిశీలిస్తున్నామని అన్నారు. గతంలో నివేదికలు సమర్పించిన అధికారుల పాత్రపైనా విచారణ చేస్తామని పేర్కొన్నారు. దేవాదాయ శాఖకు చెందిన భూముల పరిరక్షణపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి ఆనం స్పష్టం చేశారు. గతంలో జమీందారులు, ఇనాందారులు ఆలయాల నిర్వహణ కోసం భూములను కేటాయించేవారని, ప్రస్తుతం అలాంటి ఇనాం భూములు వేల ఎకరాల మేర ఉన్నాయని తెలిపారు. జగన్ హయాంలో నిర్లక్ష్యం కారణంగా ఆలయాల ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన సందర్భాలు ఉన్నాయని మంత్రి ఆనం ఆరోపించారు. ప్రస్తుతం అలాంటి భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. దేవాదాయ శాఖ రికార్డుల ప్రకారం లక్షల ఎకరాల ఆస్తులు గుర్తించామని, భూముల వివాదాలకు సంబంధించిన సుమారు 2 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

# నెత్తురోడిన ఎపి రోడ్లు

### వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

### ప్రకాశంలో ముగ్గురు, తిరుపతిలో ఇద్దరు మృత్యువాత

తిరుపతి : ఎపిలో రోడ్లు నెత్తురోడాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. ప్రకాశం జిల్లాలో ముగ్గురు, తిరుపతి జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం కామేపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన 10 మంది నాదెండ్ల మండలం సంకురాత్రిపాడులో జరిగే దశదిన కర్మకు హాజరయ్యేందుకు ఆటోలో బయల్దేరారు. కామేపల్లి రైల్వే అండర్‌పాస్ సమీపానికి వచ్చేసరికి.. గ్రానైట్‌తో వస్తున్న లారీ మలుపు తిరుగుతూ.. ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుకొండలు (60), రమణమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన మరో ఏడుగురిని సమీపంలోని వివిధ ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుబ్బాయమ్మ (70) ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఉడుంవారిపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి ఓ ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి కడప వెళ్తోంది. మరోవైపు ఓ లారీ ఎర్రగుంట్ల నుంచి చెన్నైకి వెళ్తోంది. ఉడుంవారిపల్లి వద్దకు రాగానే లారీ.. బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడాది వయసు గల చిన్నారి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పలువురికి కాళ్లు, చేతులు తెగిపడి రోడ్డు మొత్తం రక్తసిక్తమైంది. కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్సుల్లో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విరిగిన చేతిని సైతం అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపడం ప్రమాద తీవ్రతకు అద్దం పట్టింది. రాజంపేట నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అందులో కె. జస్విక (16) అనే బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. కోడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీచరణ్ అన్ని లిమిట్స్ దాటాడు

### రాధాగాయత్రి చివరి ఫోన్ కాల్ ఆడియో

విశాఖపట్నం,జూన్22 : విశాఖకు చెందిన టెకీ రాధాగాయత్రి మృతి కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. భర్తతో కలిసి ఉత్తరాఖండ్ వెళ్లిన రాధాగాయత్రి అక్కడి హోమ్‌స్టేలో మృతిచెందిన విషయం తెలిసిందే. మొదట అనుమానాస్పద కేసుగా నమోదు అయినప్పటికీ.. గాయత్రి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త శ్రీచరణ్‌పై ముస్సోరి పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. తాజాగా రాధాగాయత్రికి చెందిన చివరి ఆడియో వెలుగులోకి వచ్చింది. భర్త ప్రవర్తనపై గాయత్రి తన తల్లితో చెప్పుకుని ఆవేదన వ్యక్తం చేసింది. 'నా మనసు పూర్తిగా విరిగిపోయింది. నా మీద అనుమానం, నా గురించి చెడుగా ప్రచారం చేస్తున్నాడు. నేనేదైనా తప్పు చేస్తే నేరుగా అడగమని మా అత్తయ్యతో అన్నాను. నేను ఇక నా భర్తతో మాట్లాడదలుచుకోవడం లేదు. ఏదైనా ఉంటే మా అమ్మవాళ్లతో మాట్లాడమని చెప్పా. ఇన్నాళ్లూ ఓపిక పట్టాను. నా భర్త అన్ని లిమిట్స్ క్రాస్ అయిపోయాడు' అని ఫోన్‌లో రాధాగాయత్రి చెబుతున్నట్లు ఆడియోలో ఉంది. తల్లితో గాయత్రి ఫోన్ సంభాషణ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## పల్లా శ్రీనివాసరావుతో రాధాగాయత్రి తల్లి భేటీ

### కూతరు మరణంపై వివరణ..న్యాయం కోసం అభ్యర్థన

### అండగా ఉంటామని టిడిపి అధ్యక్షుడి హామీ

విశాఖపట్నం,జూన్22 : విశాఖకు చెందిన టెకీ రాధా గాయత్రి మృతి కేసులో న్యాయం కోసం కుటుంబసభ్యులు పోరాడుతున్నారు. సోమవారం ఉదయం టీడీపీ ఎమ్మెల్యే శ్రీనివాస్ రావును గాయత్రి తల్లి సత్యవతి కలిశారు. ఈ సందర్భంగా రాధా గాయత్రి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. తమకు న్యాయం చేయాలని, కూతురి మృతికి కారణమైన దోషులను శిక్షించాలని తల్లి, బంధువులు కోరారు. ఈ కేసు విషయంపై హోం మంత్రి వంగలపూడి అనితతో పల్లా శ్రీనివాస్ ఫోన్‌లో మాట్లాడారు. రాధా గాయత్రి హత్య కేసుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారం అందిస్తామని పల్లా తెలిపారు. టెకీ గాయత్రి హత్య ముస్సోరిలో జరగటంతో కేసు తుది విచారణ హక్కు అక్కడి పోలీసులకే ఉంటుందన్నారు. రాధా గాయత్రి కుటుంబానికి అండగా ఉంటామని పల్లా శ్రీనివాస్ రావు హామీ ఇచ్చారు. భర్త శ్రీచరణ్‌తో కలిసి ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీకి వెళ్లిన గాయత్రి ఈనెల 14న అక్కడి హోమ్‌స్టేలో మృతిచెందిన విషయం తెలిసిందే. గాయత్రి ముక్కు నుంచి రక్తం వచ్చినట్లు గుర్తించిన ముస్సోరి పోలీసులు తొలుత అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. అయితే గాయత్రి తండ్రి ఫిర్యాదుతో భర్త శ్రీచరణ్‌పై అక్కడి పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కుటుంబసభ్యులను ఏపీ తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసు గురించి విన్నప్పుడు చాలా బాధ కలిగిందన్నారు. శ్రీచరణ్ సింహాచలం పరిధిలో ఒక లాడ్జిలో దిగినట్లు బంధువులు చెబుతున్నారు. కేసు నమోదైన వెంటనే ఇక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. ఇప్పటికే ముస్సోరీలో కేసు నమోదు చేశారని పల్లా తెలిపారు. మొదటినుంచి శ్రీచరణ్ సైకోలాగే ప్రవర్తిస్తున్నాడని మృతురాలి తల్లి సత్యవతి కన్నీరుమున్నీరయ్యారు. ఇబ్బందిపెడుతున్నట్లు వారం ముందే గాయత్రి చెప్పింది. మృతి చెందిన రోజు అర్ధరాత్రి దాటాక గాయత్రితో శ్రీచరణ్ సెల్ఫీ పెట్టాడు. ఎప్పుడూ ఏ సెల్ఫీ పెట్టని అతడు.. ఆ రోజు మాత్రం పెట్టాడు. మరుసటిరోజు ఉదయమే గాయత్రి మృతి చెందిందని, విమాన టికెట్ పంపాడని సత్యవతి మీడియాకు తెలిపారు. విజయనగరం జిల్లా మామిడిపల్లికి చెందిన రాధా గాయత్రికి గతేడాది నవంబర్‌లో విశాఖకు చెందిన శ్రీచరణ్‌తో వివాహమైంది. ఇద్దరూ కలిసి ఇటీవల విహారయాత్రకు వెళ్లగా.. ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్‌లో ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంగతి తెలిసిందే.

## నిరుద్యోగానికి తోడు..ఆర్థిక సమస్యలు

నిజామాబాద్,జూన్22 : ఎంబీఏ విద్య పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఉద్యోగం లభించకపోవడం, ఉండడానికి సొంత ఇల్లు కూడా లేకపోవడంతో మానసికంగా బాధపడుతూ ఓ యువకుడు మనస్థాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన దోమ్మటి నితిన్ గౌడ్ (27) తమ గ్రామంలో సొంత ఇల్లు లేకపోవడం, అలాగే ఎంబీఏ విద్య పూర్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఉద్యోగం లభించకపోవడంతో మానసికంగా బాధపడుతూ ఉండేవాడని స్థానికులు తెలిపారు. కాగా సోమవారం లోంక గుడి కి వెళ్తున్నానని ఇంటి నుండి తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అనంతరం లోంక తండా దాటిన తర్వాత రోడ్డుపై తన బైకు నిలిపి సమీప అటవీ ప్రాంతంలో టేకు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

## చిత్తూరు జిల్లాలో దారుణ ఘటన

### ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బలవన్మరణం

చిత్తూరు,జూన్22 : చిత్తూరు జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన దిగుమసపల్లె పంచాయతీ బంగారెడ్డిల్లిలో జరిగింది. దామోదరం(30) అనే వ్యక్తి.. తన భార్య నిర్మల(25), కుమారుడు రాజేష్, కుమార్తె శ్రీవిద్యకు విషమిచ్చి, అనంతరం తానూ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కొన్ని రోజులుగా సీఎంసీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. భార్య ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడం, ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉండటంతో దామోదరం ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న బీఎన్ఆర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దామోదర్.. సూసైడ్ నోట్‌లో బ్యాంకు ఏటీఎం కార్డు, ఫోన్‌పే పిన్ నెంబర్ రాసిపెట్టాడు. అంత్యక్రియలకు తన ఖాతా నుంచే డబ్బులు వాడుకోవాలని లేఖలో పేర్కొన్నాడు.

## సాయికృష్ణ లాకప్ డెత్ కేసును సీబీఐకి అప్పగించాలి

### స్వతంత్ర దర్యాప్తు సాగితేనే కూటమి ప్రభుత్వంపై నమ్మకం

### మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి డిమాండ్

చిత్తూరు,జూన్22 : సాయికృష్ణ లాకప్ డెత్ కేసును సీబీఐకి అప్పగించాలని వైసీపీ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి డిమాండ్ చేశారు. చిత్తూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నమ్మాలంటే ఈ కేసుపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని అన్నారు. సాయికృష్ణ నిజంగా నేరస్తుడే అయితే కోర్టులు శిక్షించి ఉండేవని నారాయణస్వామి పేర్కొన్నారు. టెర్రరిస్టులను ఎన్‌కౌంటర్ చేసిన సందర్భాల్లో కూడా వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తారని గుర్తు చేశారు. సాయికృష్ణ తల్లి తన కుమారుడు కనిపించడం లేదని ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని, అయితే ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమెను పిలిపించి మాట్లాడటం ఆశ్చర్యకరంగా ఉందని విమర్శించారు. తమిళనాడులో జరిగిన పోలీసుల లాకప్ డెత్ ఘటనలపై కోర్టులు తీవ్ర వ్యాఖ్యలు చేశాయని, అదే విధంగా సాయికృష్ణ కేసులో కూడా పూర్తి స్థాయి విచారణ జరగాలని నారాయణస్వామి కోరారు.. అలాగే క్రాంతికుమార్‌ను సీఐ నాగరాజ్ వేధించిన అంశాన్ని కూడా సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ పాలన వల్లే క్రాంతికుమార్, సాయికృష్ణ మృతికి కారణమైన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన ఆరోపించారు. హోంమంత్రి శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలను విస్మరించి ముఖ్యమంత్రి చంద్రబాబు భజనకే పరిమితమయ్యారని విమర్శించారు. తిరుపతిలో మంత్రి లోకేష్ రెడ్‌బుక్ గురించి ప్రస్తావించిన తర్వాత పోలీసులు మరింత రెచ్చిపోతున్నారని ఆరోపించారు. తనను రెడ్‌బుక్‌తో పాటు ఎన్ని పుస్తకాల ద్వారా ఇరికించేందుకు ప్రయత్నించినా తాను భయపడబోనని నారాయణస్వామి స్పష్టం చేశారు. తనపై అవినీతి ఆరోపణలు చేయలేమని గతంలో చంద్రబాబే చెప్పారని గుర్తు చేశారు. ఇక, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై కూడా నారాయణస్వామి విమర్శలు గుప్పించారు. పవన్ సినిమా నటుడని, ఆయన ఎప్పుడు ఏమి మాట్లాడతారో ఆయనకే తెలియదని వ్యాఖ్యానించారు. ముందుగా కూటమి నాయకులపై ఉన్న క్రిమినల్ కేసులపై చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్‌ను కోరారు. మామిడి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కిలోకు రూ.4 మద్దతు ధర కూడా వైసీపీ చేపట్టిన పోరాటాల ఫలితమేనని నారాయణస్వామి అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం వైసీపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు వైసీపీ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి.

ది క్రైమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక




# అనిల్ రావిపూడి మూవీలో ఛాన్స్ అంటూ ప్రకటనలు

## అవన్నీ ఫేక్..నమ్మొద్దంటూ ప్రకటన విడుదల

ప్రస్తుతం తెలుగు ఇండస్ట్రీలోక్రేజ్ ఉన్న దర్శకుల్లో అనిల్ రావిపూడి ఒకరు. ఆయన మూవీలో నటించేందుకు ఎంతో మంది ఆసక్తి చూపుతారు. దీన్నే అదనుగా తీసుకుని కొంతమంది సరికొత్త మోసానికి తెరలేపారు. ఈ విషయం కాస్తా చిత్ర నిర్మాణ సంస్థ దృష్టికి వెళ్లడంతో అవన్నీ ఫేక్ అంటూ ప్రకటన ఇవ్వాల్సి వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. వెంకటేశ్, కల్యాణ్‌రామ్ కథానాయకులుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ మూవీ రూపొందుతున్నది. కీర్తి సురేశ్, కృతిశెట్టి కథానాయికలు. ఇటీవల పూజా కార్యక్రమాలతో ఈ మూవీ మొదలైంది. అంతేకాదు, 'రాయల సీమ నేపథ్యం' అంటూ ప్రచారాన్ని కూడా అనిల్ రావిపూడి వినూత్నంగా ప్రారంభించారు. ఈ క్రమంలో ఇందులో నటించే అవకాశం ఇప్పిస్తామంటూ కొంతమంది సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటనలు ఇవ్వడం మొదలు పెట్టారు. దీంతో అవన్నీ ఫేక్ అంటూ నిర్మాణ సంస్థ ÷న్ స్క్రీన్స్ తెలిపింది. మా సినిమా పేరుతో ఒక నకిలీ కాస్టింగ్ కాల్ సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా ప్రచారం అవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆ కాస్టింగ్ కాల్‌కు, మా చిత్ర బృందానికి ఎలాంటి సంబంధం లేదు. దయచేసి అలాంటి





మోసపూరిత ప్రకటనలను నమ్మొద్దు. మా సినిమా తరఫున కాస్టింగ్ పేరుతో సంప్రదిస్తున్న వ్యక్తులకు మీ వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, పత్రాలు లేదా డబ్బు ఇవ్వవద్దని విజ్ఞప్తి. మా చిత్రానికి సంబంధించిన ఏవైనా అధికారిక కాస్టింగ్ ప్రకటనలు ఉంటే, అవి కేవలం మా అధికారిక, ధ్రువీకరించిన సోషల్ మీడియా ఖాతాల ద్వారానే ప్రకటిస్తాం. జాగ్రత్తగా ఉండండి. మోసగాళ్ల వలలో పడొద్దని హెచ్చరించారు.



# ప్రేక్షకుల దృక్కోణం మారింది


సాయి దుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్.కె.పి దర్శకత్వంలో రానుంది. ఈ సినిమా విడుదల ఆలస్యం కావడంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. తాజాగా ఈ ఆలస్యంపై సాయి దుర్గా తేజ్ స్పందించారు. సినిమాల ఎంపికలో తాను ఎందుకు ఇంత సమయం అవసరమవుతోందో వివరించారు. ప్రస్తుతం ప్రేక్షకులు ఓటీటీల్లో ఎన్నో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు వీక్షిస్తున్నట్లు తెలిపారు. అన్ని జానర్‌లలోని కంటెంట్ గురించి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రేక్షకుల ఆలోచనల్లో మార్పు వచ్చిందని అందుకే తన సినిమాల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వాళ్లను మెప్పించాలంటే కథల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించక తప్పదన్నారు. అందుకే కాస్త సమయం పడుతోందని స్పష్టం చేశారు. ఈ సినిమా కోసం తన సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా శ్రమిస్తున్నట్లు గతంలో సాయి దుర్గా తేజ్ తెలిపారు. దర్శకుడు రోహిత్ విజన్ అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా తన కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుందని చెప్పారు.




# కలెక్షన్లలో మా ఇంటి బంగారం దూకుడు

## పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకుల ఆదరణ

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లతో దూసుకుపోతోంది. దాదాపు మూడు సంవత్సరాల విరామం తర్వాత సమంత నుంచి వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ విజయపథంలో కొనసాగుతోంది. మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ మూవీ, వీకెండ్‌లో మరింత జోరు చూపించి భారీ కలెక్షన్లను నమోదు చేసింది. సాధారణంగా స్టార్ హీరోల సినిమాలకు కనిపించే స్థాయిలో 'మా ఇంటి బంగారం'కు ప్రేక్షకుల నుంచి స్పందన లభిస్తోంది. మొదటి రోజు మంచి ఓపెనింగ్స్ సాధించిన ఈ చిత్రం, శనివారం, ఆదివారం రోజుల్లో మరింత మెరుగైన వసూళ్లను రాబట్టింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, కేవలం మూడు రోజుల్లోనే మా ఇంటి బంగారం సినిమా ఇండియా వైడ్ నెట్ కలెక్షన్లలో రూ.23.10 కోట్ల మార్కును దాటేసింది. ఈ మూడు రోజుల్లో సినిమా సాధించిన మొత్తం ఇండియా గ్రాస్ కలెక్షన్లు రూ.26.69 కోట్లకు చేరాయి.సమంతకు ఉన్న క్రేజ్ కారణంగా ఈ చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లోభారీ స్పందన లభించింది. కేవలం తెలుగు వెర్షన్ నుంచే మూడో రోజు రూ.9.50 కోట్ల నెట్ కలెక్షన్లు రావడం విశేషం.కుటుంబ ప్రేక్షకులు, మహిళలు, యువత ఈ చిత్రానికి పెద్ద ఎత్తున థియేటర్లకు రావడంతో అనేక ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించాయి.ముఖ్యంగా మౌత్ టాక్ సినిమాకు అతిపెద్ద బలంగా మారింది. సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకోవడం, కుటుంబంతో కలిసి చూడదగిన చిత్రంగా ప్రశంసించడం వల్ల వసూళ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తెలుగు చిత్ర పరిశ్రమలో లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు భారీ ఓపెనింగ్స్ సాధించడం అరుదుగా కనిపిస్తుంది. అయితే 'మా ఇంటి బంగారం' ఆ రికార్డులను తిరగరాస్తూ, సమంత స్టార్‌డమ్‌కు మరోసారి నిదర్శనంగా నిలిచింది. ఈ చిత్రానికి దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో కుటుంబ భావోద్వేగాలు, హాస్యం, యాక్షన్ అంశాలను సమతుల్యంగా మిళితం చేశారు. ప్రేక్షకులను ఆకట్టుకునే కథనం, సహజమైన పాత్రల రూపకల్పన సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి.గుల్షన్ దేవయ్య, దిగంత్, గౌతమి, శ్రీముఖి తదితరులు తమ పాత్రల్లో మెప్పించగా, సమంతతో వారి సన్నివేశాలు సినిమాకు మరింత బలం చేకూర్చాయి. వీకెండ్‌లో అనేక ప్రాంతాల్లో థియేటర్లు హౌస్‌ఫుల్‌గా మారాయి.



# బాక్సాఫీస్ వద్ద కాక్‌టెయిల్-2 సంచలనం

భారీ వసూళ్లు రాబడుతున్న మూవీ బాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ మూవీగా థియేటర్లలోకి వచ్చింది 'కాక్‌టెయిల్ 2'. షాహిద్ కపూర్, రష్మిక మందన్న, కృతి సనన్ జంటగా హోమీ అదాజానియా దర్శకత్వంలో వచ్చిన కాక్‌టెయిల్ బాక్సాఫీస్ వద్ద అదిరిపోయే ఓపెనింగ్స్ రాబట్టింది. మొదటి వీకెండ్‌లోనే ఈ సినిమా ఇండియా వ్యాప్తంగా భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. మూడు రోజుల్లోనే మంచి హోల్డ్ సాధించి ట్రేడ్ వర్గాల్లో పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేసింది. ఈ సినిమా బాక్సాఫీస్ ప్రయాణాన్ని గమనిస్తే.. మొదటి రోజు నుంచే సాలిడ్ కలెక్షన్లు నమోదయ్యాయి. మొదటి రోజు రూ. 115.39 కోట్లు, రెండవ రోజు రూ. 19.25 కోట్లు, మూడవ రోజు ఆదివారం రూ. 20.22 కోట్లు రాబట్టి సూపర్ స్ట్రాంగ్ గా హోల్డ్ చేసింది. మొత్తంగా చూసుకుంటే మూడు రోజుల మొదటి వీకెండ్‌లో 'కాక్‌టెయిల్ 2' ఆల్ ఇండియా ట్రాక్డ్ గ్రాస్ కలెక్షన్స్ రూ. 54.86 కోట్లకు అటు ఇటుగా నమోదు చేసింది. సీక్వెల్ హైప్ కు తోడు మౌత్ టాక్ బాగుండటంతో సాలిడ్ కలెక్షన్స్ రాబట్టింది. బాలీవుడ్ బాక్సాఫీస్ పరంగా ఇదొక అద్భుతమైన వీకెండ్ ఓపెనింగ్ అని చెప్పొచ్చు. అయితే పోటీలో మరే ఇతర సినిమాలు లేకపోవడం ఈ సినిమా రన్ కు కాస్త కలిసొచ్చే అంశం. మరి వీక్‌డేస్‌లో ఈ సినిమా ఎలాంటి ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుందో చూడాలి. రూ. 150కోట్లతో తెరకెక్కిన కాక్‌టెయిల్ 2 ఫైనల్ రన్ లో ఎంత సాధిస్తుందో చూడాలి.



# బాలకృష్ణ- కొరటాల కాంబో

## 25న షూటింగ్ ప్రారంభానికి ముహూర్తం

బాలకృష్ణ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఎన్‌బికె 112'గా ప్రచారంలో ఉంది. ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. తాజాగా ఆ వివరాలను చిత్రబృందం పంచుకుంది. జూన్ 25న వెంకటపాలెంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరగనుంది. ముఖ్య అతిథులుగా మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్ హాజరు కానున్నారు. మే నెలలో ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. 'అధికారానికి ఉద్దేశం తోడైతే.. అది ఉద్యమంగా మారుతుంది' అనే పవర్‌ఫుల్ కొటేషన్‌తో టీమ్ దీనిపై అంచనాలు పెంచేసింది. కొరటాల శివ మార్కు సామాజిక సందేశంతో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్‌ట్రైనర్‌గా ఈ సినిమా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలయ్య.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ – గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. కాజల్ కథానాయికగా నటిస్తుండగా.. మంచు మనోజ్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. ఈ రెండు సినిమాలను బాలకృష్ణ ఒకేసారి పూర్తి చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

# 'ఆ ఒక్కటీ అడక్కు' ట్రైలర్ విడుదల

స్నేహితులైన టాలీవుడ్ హీరోలు అల్లరి నరేశ్,నాని 'ఆ ఒక్కటీ అడక్కు' ట్రైలర్ విడుదల వేడుకలో సందడి చేశారు. నరేశ్ హీరోగా నూతన దర్శకుడు మల్లి అంకం తెరకెక్కించిన చిత్రమిది. ఫరియా అబ్దుల్లా హీరోయిన్. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఈవెంట్‌కు నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నరేశ్ ఎక్కువగా తన చిత్రాల ఈవెంట్లకు నన్ను రమ్మని అడగడు. ఈ సినిమాకి పిలిచాడంటే అది తన మనసుకు ఎంత దగ్గరైందో అర్థమైంది. ఈ సినిమా టైటిల్‌తోనూ తనకు ఎమోషనల్ కనెక్షన్ ఉంది. నరేశ్‌ని కామెడీ నుంచి కాస్త బ్రేక్ తీసుకోమని ఒకానొక సమయంలో పట్టుబట్టా. తను ప్రతిభావంతుడు. అలాంటివాడు విభిన్న నేపథ్య కథల్లో నటిస్తే బాగుంటుందనే ఉద్దేశంతోనే అలా చెప్పా. కానీ, ఇప్పుడు ఈ సినిమా ట్రైలర్ చూశాక 'ఇతడి కామెడీని నేను మిస్ అయ్యానా?' అని అనిపించింది. నరేశ్ మాట్లాడుతూ.. అన్ని విభాగాల వారు కష్టపడి, ఇష్టపడి చేసిన సినిమా ఇది. చాలాకాలం తర్వాత కామెడీ ఫిల్మ్‌తో మీ ముందుకొస్తున్నా. ఈ వేసవిలో మిమ్మల్ని తప్పకుండా నవ్విస్తా అని అన్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com

# స్పోర్ట్స్

# బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పు చేయాలి

## భారత బ్యాటింగ్ దిగ్గజం మిథాలీ రాజ్ సూచన



ఆదివారం ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో దక్షిణాఫ్రికాతో జరిగిన ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లో భారత జట్టు 6 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ ఓటమిపై భారత బ్యాటింగ్ దిగ్గజం మిథాలీ రాజ్ స్పందిస్తూ.. టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో ఒక చిన్న మార్పు చేయాలని సూచించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను 5వ స్థానానికి బదులుగా 4వ స్థానంలో బ్యాటింగ్‌కు పంపించాలని, అలాగే జెమిమా రోడ్రిగ్స్‌ను 5వ స్థానంలో ఆడించాలని ఆమె ప్రతిపాదించారు. ఈ మ్యాచ్‌లో గెలిచి ఉంటే భారత్ గ్రూప్-ఎ పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని, సెమీఫైనల్ అవకాశాలను మరింత మెరుగుపరుచుకునేదని, కానీ ఈ ఓటమితో ఇకపై టోర్నమెంట్‌లో భారత్‌కు తప్పులు చేసే అవకాశం లేదని మిథాలీ పేర్కొన్నారు. మిథాలీ రాజ్ మాట్లాడుతూ--- "భారత్‌కు ఇది నిరాశాజనకమైన మ్యాచ్. ఈ మ్యాచ్ గెలిచి ఉంటే పట్టికలో అగ్రస్థానంలో నిలిచేవారు. కానీ ఇప్పుడు సెమీస్‌కు చేరాలంటే ఆస్ట్రేలియాపై ఖచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి వచ్చింది. బ్యాటింగ్ ఆర్డర్ పరంగా చూస్తే, హర్మన్‌ప్రీత్ కౌర్ 5వ స్థానంలో అంత లేట్‌గా బ్యాటింగ్‌కు రావడం మనం తరచుగా చూడలేదు. కాబట్టి ఆమె 4వ స్థానంలో, జెమిమా 5వ స్థానంలో వస్తే బాగుంటుంది. జెమిమా గతంలో 5వ స్థానంలో ఆడి చాలా పరుగులు చేసింది. ఆమె క్రీజులోకి వచ్చే సమయానికి స్పిన్నర్లు బౌలింగ్ చేసే అవకాశం ఉంటుంది. స్పిన్‌ను ఆడటం జెమిమా బలం. ఆమె క్రీజు వెలుపలికి వచ్చి ఆడటంతో పాటు స్వీప్స్, స్వీప్ షాట్లు బాగా ఆడుతుంది. హర్మన్‌ప్రీత్ ముందుగా వచ్చి, ఆ తర్వాత జెమిమా వస్తే ఆమెకు ఫామ్‌లోకి రావడానికి, మంచి రిథమ్ అందుకోవడానికి సహాయపడుతుంది" అని అన్నారు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 158 పరుగుల పోటీతత్వ స్కోరు సాధించి మ్యాచ్‌పై పట్టు సాధించినట్లే కనిపించింది. అయితే దక్షిణాఫ్రికా బ్యాటర్ మరిజానే కాప్ కేవలం 45 బంతుల్లోనే 81 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి, చివరి ఓవర్లో తన జట్టును గెలిపించింది. ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు ఇది మొదటి ఓటమి. దీంతో నాకౌట్ దశకు వెళ్లే మార్గం క్లిష్టంగా మారింది. మ్యాచ్ ఓడిపోయినప్పటికీ, యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి ప్రదర్శనను మిథాలీ రాజ్ ప్రత్యేకంగా అభినందించారు. శ్రీ చరణి ఒకే ఓవర్లో రెండు కీలక వికెట్లు తీసి దక్షిణాఫ్రికాను 25/2 స్కోరు వద్ద దెబ్బతీసి భారత్‌ను తిరిగి మ్యాచ్‌లోకి తెచ్చింది. శ్రీ చరణి గురించి మిథాలీ మాట్లాడుతూ--- "శ్రీ చరణి త్వరగా నేర్చుకునే ఆటగాడు. ఇంగ్లండ్ వాతావరణంలోనే ఆమె అరంగేట్రం చేసింది కాబట్టి ఇక్కడి పరిస్థితులపై ఆమెకు అవగాహన ఉంది. పిచ్ నుండి స్పిన్నర్లకు పెద్దగా సహకారం లేకపోయినప్పటికీ, ఆమె స్థిరంగా స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బౌలింగ్ చేసింది. వేగాన్ని, లెంగ్త్‌ను మారుస్తూ తనకు కావాల్సిన ఫీల్డింగ్‌ను సెట్ చేసుకుంది. రెండో స్పెల్‌లోనూ ఆమె చాలా కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పరుగులను నియంత్రించింది" అని కొనియాడారు. రెండు క్యాచ్‌లు డ్రాప్ అవ్వడం, కాప్ అద్భుత బ్యాటింగ్ కారణంగా భారత్ మ్యాచ్‌ను కాపాడుకోలేకపోయింది.



# కోహ్లీ టెస్టుల్లోకి రీఎంట్రీ ఇస్తాడా..?

స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తన టెస్ట్ క్రికెట్ రీఎంట్రీ వార్తలకు పూర్తిగా తెరదించాడు. తన వన్8 బ్రాండ్ షూ లాంచ్ ఈవెంట్‌లో హోస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. టెస్ట్ క్రికెట్‌తో తన పని అయిపోయిందని స్పష్టం చేశాడు. కోహ్లీ తన టెస్ట్ కెరీర్‌లో చేసిన మొత్తం పరుగులు 9,230 కాగా, దానికి గుర్తుగా కొత్త షూ ధరను కూడా రూ. 9,230 గానే నిర్ణయించడం విశేషం. ప్రస్తుతం కోహ్లీ దృష్టి కేవలం వన్డే ఫార్మాట్ పైనే ఉంది. విరాట్ కోహ్లీ .. ప్రపంచ క్రికెట్‌లో పరిచయం అక్కర్లేని పేరు. ఎన్నో రికార్డులు అతడి సొంతం. ఛేజ్ మాస్టర్‌గా పేరుపొందిన విరాట్ కోహ్లీ.. భారత్‌కు ఎన్నో అపురూప విజయాలు అందించాడు. ప్రపంచ క్రికెట్‌లో రికార్డులు బద్దలు కొట్టాడు. అయితే ప్రస్తుతం కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ముగింపు దశకు వచ్చింది. ఇప్పటికే టీ20, టెస్టులకు గుడ్ బై చెప్పేశాడు కోహ్లీ. కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్ 2027 కోహ్లీ కెరీర్‌లో చివరి ఈవెంట్ అయ్యే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. అయితే ఇటీవల కొన్ని వార్తలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. టెస్ట్ క్రికెట్‌కే ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కింగ్.. రిటైర్మెంట్ వెనక్కి తీసుకుని మళ్లీ రీఎంట్రీ ఇస్తాడనే వార్తలు వస్తున్నాయి. అభిమానులు కూడా ఈ వార్తలు నిజం కావాలని కోరుకుంటున్నారు. అతడిలో ఇంకా క్రికెట్ ఉందని.. టెస్ట్ క్రికెట్‌కు అతడి అవసరం ఉందని పేర్కొంటున్నారు. అయితే ఇదే విషయంపై ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న కోహ్లీకి ప్రశ్న ఎదురైంది. దీనికి అతడు తనదైన శైలిలో సమాధానమిచ్చాడు. ఇటీవల కోహ్లీ స్పోర్ట్స్ బ్రాడ్ వన్8 లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్నాడు. ఈ బ్రాండ్‌లో ఓ షూ ధర రూ. 9,230గా ఉంది. టెస్ట్ క్రికెట్‌లో కోహ్లీ సాధించిన పరుగులు సైతం 9,230 కావడం గమనార్హం. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ హోస్ట్.. కోహ్లీని ఉద్దేశించి ఓ ప్రశ్న అడిగాడు. "విరాట్ మీరు ఇంకొన్ని రన్స్ చేసి.. ఆ షూ లాభాలు పెంచొచ్చు కదా?" అని అడిగాడు. దీనికి కోహ్లీ "నేను తక్కువ ధరకే అమ్మేయడానికి ఇష్టపడతా. మీరు ఏదైతే అడుగుతున్నారో దానితో.. (టెస్ట్ క్రికెట్‌ను ఉద్దేశిస్తూ.. ) నా పని అయిపోయింది. థాంక్యూ" అని విరాట్ కోహ్లీ సమాధానమిచ్చాడు. కోహ్లీ సమాధానంతో అతడు మళ్లీ టెస్ట్ క్రికెట్‌లో ఆడబోడనే విషయం స్పష్టమైంది. కోహ్లీ.. త్వరలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో బరిలోకి దిగే అవకాశం ఉంది.

# ఇంగ్లాండ్ జట్టులోకి స్టోక్స్ అడుగు

న్యూజిలాండ్‌తో జూన్ 25 నుంచి ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ప్రారంభం కానున్న మూడో టెస్టు కోసం ఇంగ్లాండ్ జట్టులోకి బెన్ స్టోక్స్, గస్ అట్కిన్సన్ తిరిగి వచ్చారు. లండన్ నైట్ క్లబ్‌లో రగ్బీ ఆటగాడితో ఘర్షణ పడి ఈసీబీ నిబంధనలు ఉల్లంఘించినందుకు వీరిని రెండో టెస్టుకు దూరం పెట్టారు. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమం కావడంతో, ఈ నిర్ణయాత్మక ఆఖరి టెస్టులో బెన్ స్టోక్స్ తిరిగి కెప్టెన్‌గా ఇంగ్లాండ్ జట్టును నడిపించనున్నాడు. న్యూజిలాండ్‌తో జూన్ 25 నుంచి ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ప్రారంభం కానున్న మూడో టెస్టుకు ఇంగ్లాండ్ జట్టులో బెన్ స్టోక్స్ , గస్ అట్కిన్సన్ జట్టులో చోటు దక్కించుకున్నారు. తొలి టెస్టులో ఇంగ్లాండ్ విజయం సాధించిన తర్వాత లండన్ నైట్ క్లబ్‌లో జరిగిన సంఘటన తరువాత వీరిద్దరినీ జట్టు నుంచి తప్పించారు. కానీ మూడో టెస్టుకు ముందు వీరిద్దరూ తిరిగి జట్టులోకి వచ్చారు. బెన్ స్టోక్స్ తిరిగి సారథ్య బాధ్యతలు చేపడతాడని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ధ్రువీకరించింది. కాగా లార్డ్స్‌తో న్యూజిలాండ్‌తో టెస్టు మ్యాచ్ ముగిసిన తర్వాత జూన్ 8న స్టోక్స్, అట్కిన్సన్ ఇద్దరూ ఓ నైట్ క్లబ్‌కు వెళ్లారు. నిజానికి ఇలా వెళ్లేందుకు వారికి అనుమతి లేదు. అయినా ఈసీబీ నిబంధలను ఉల్లంఘించి వారు అక్కడికి వెళ్లారు. నైట్ క్లబ్‌లో రగ్బీ ఆటగాడు టోటోవా ఔవాతో వీరు ఘర్షణకు దిగినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో ఓ సెక్యూరిటీ సిబ్బందికి కూడా గాయాలు కావడంతో విషయం ముదిరింది. దీంతో వారిని జట్టు నుంచి తప్పించారు. ఆ తర్వాత బెన్ స్టోక్స్, అట్కిన్సన్ వెళ్లి కౌంటీల్లో ఆడారు. కానీ ఈసీబీ సూచన మేరకు కౌంటీల్లో తమ తర్వాతి మ్యాచుకు వీరు దూరమయ్యారు. న్యూజిలాండ్‌తో మూడో టెస్టు కోసం ఎంపిక చేసిన జట్టులో చోటు సంపాదించారు. కాగా లార్డ్స్‌లో జరిగిన తొలి టెస్టులో ఇంగ్లాండ్.. న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. కానీ రెండో టెస్టులో మాత్రం 253 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. దీంతో రెండు టెస్టులు ముగిసే సరికి సిరీస్ 1-1తో సమమైంది. నిర్ణయాత్మక మూడో టెస్టు జూన్ 25 నుంచి ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచు ఫలితం సిరీస్ విజేత ఎవరో తేల్చనుంది.





# ఫిఫా వరల్డ్‌కప్‌లో చరిత్ర సృష్టించిన ఈజిప్ట్

## న్యూజిలాండ్‌పై ఈజిప్ట్ 1-3 తేడాతో విజయం

2026 ఫిఫా వరల్డ్‌కప్‌లో ఈజిప్ట్ చరిత్ర సృష్టించింది. వరల్డ్?కప్?లోనే తొలి విజయం నమోదు చేసింది. తాజాగా గ్రూప్ జీలో భాగంగా న్యూజిలాండ్?తో జరిగిన మ్యాచ్‌లో ఈజిప్ట్ 1-3 తేడాతో విజయం సాధించింది. ఫలితంగా ఫిఫా హిస్టరీలోనే తొలిసారి గెలుపు రుచి చూసింది. దీంతో ఈజిప్ట్ అభిమానుల సంబరాలకు హద్దుల్లేకుండా పోయాయి. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్?లో ఈజిప్ట్ 1934లో ఎంట్రీ ఇచ్చింది. అప్పట్నుంచి 92 ఏళ్లు గడిచినా ఈ మ్యాచ్?కు ముందు ఒక్క విజయం కూడాసాధించలేదు. కానీ తాజా మ్యాచ్?లో జికో, సలాహ్, ట్రెజెగెట్ అద్భుతమైన రీతిలో గోల్స్ సాధించడంతో ఫిఫాలో తొలి విజయం అందుకోగలిగింది. ఇది ఈజిప్ట్? ఫుట్?బాల్ చరిత్రలో నిలిచిపోనుంది! వాంకోవర్‌లోని దీజ ప్లేస్ గ్రౌండ్?లో న్యూజిలాండ్?ను ఈజిప్ట్ ఢీ కొట్టింది. అయితే ఈజిప్ట్? కంటే మెరుగైన న్యూజిలాండ్ జట్టు ఆటను దూకుడుగానే ప్రారంభించింది. ఆరంభంలోనే కివీస్ ప్లేయర్లు సర్‌ప్రీత్ సింగ్, ఎలిజా జస్ట్ గోల్స్ చేసేందుకు ప్రయత్నించినా ఈజిప్ట్ అడ్డుకుంది. అయితే 15వ నిమిషంలో కార్నర్ నుంచి వచ్చిన బంతిని ఫిన్ సుర్మాన్ బుల్లెట్ వేగంతో గోల్ చేసి న్యూజిలాండ్?ను ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. దీనికి ఈజిప్ట్ కూడా గట్టిగానే బదులిచ్చింది. స్కోరును సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. అయితే ఫస్టాఫ్ ముగిసే ముగింట సలాహ్, ఇమామ్ అషూర్ ఇద్దరూ గోల్ చేసేందుకు దగ్గరగా వచ్చారు. కానీ న్యూజిలాండ్ అడ్డుకోవడంతో 1-0తో ఈజిప్ట్ వెనుజంలో తొలి భాగం ముగించింది. అయితే సెంకడ్ హాఫ్?లో ఈజిప్ట్ అద్భుతంగా పోరాడింది. ఆట ప్రారంభమైన కొద్ది సేపటికే న్యూజిలాండ్ మరో గోల్?కు దగ్గరగా వెళ్లింది. కాలమ్ మెక్‌కోవాట్ తలతో కొట్టిన బంతిని, ఈజిప్ట్ గోల్ కీపర్ మోస్తఫా షోబీర్ అద్భుతంగా అడ్డుకున్నాడు. అనంతరం ఈజిప్ట్ ఆటగాడు జీకో ఫ్రీ హెడర్ (58వ నిమిషం) గోల్ కొట్టి స్కోర్లను సమం చేశాడు. ఆ తర్వాత తొమ్మిది నిమిషాలకే సలాహ్ (67వ ని) బంతిని నెట్‌లోకి పంపించి ఈజిప్ట్?కు ఆధిక్యం అందించాడు. దీంతో ఈజిప్ట్? సంబరాల్లో మునిగిపోయింది. ఈ లీడ్?ను అలాగే కాపాడుకుంటూ ఈజిప్ట్? మ్యాచ్? ఎండింగ్ దాకా తీసుకెళ్లింది. ఆట ముగియడానికి ఎనిమిది నిమిషాలు ఉండగా ఈజిప్ట్ తరఫున ట్రెజెగెట్ (82 వ ని) మూడో గోల్ చేసి విజయాన్ని జట్టుకు విజయం ఖరారు చేశాడు. దీంతో ఈజిప్ట్ సంబరాల్లో మునిగిపోయింది. తాజా విజయంతో ఈజిప్ట్ గ్రూప్ జీ పాయింట్ల పట్టికలో టాప్?లోకి దూసుకెళ్లింది. దీంతో నాకౌట్ దశకు చేరువైంది. రెండు మ్యాచ్?ల్లో ఒక డ్రా, ఒక గెలుపుతో ఈజిప్ట్ ఖాతాలో ప్రస్తుతం నాలుగు పాయింట్లు ఉన్నాయి. మరోవైపు ఈ ఓటమితో నాలుగో స్థానంలో (1 పాయింట్) ఉంది. ఇరాన్ రెండో (2 పాయింట్లు), బెల్జియం (2 పాయింట్లు)మూడో ప్లేస్?లో ఉన్నాయి. అలాగే సోమవారం జరిగిన ఉరుగ్వే- కేప్ వెర్డే మ్యాచ్? 2- 2తో డ్రాగా ముగిసింది. ఈ ఫిఫాలో తొలిసారి ఆడుతున్న కేప్ వెర్డే వరుసగా రెండో మ్యాచ్?లోనూ అద్భుత ప్రదర్శనతో ఆశ్చర్యానికి గురిచేసింది. గత వారం టోర్నమెంట్ ఫేవరెట్ స్పెయిన్‌కు షాకిచ్చిన ఈ పసికూన, తాజాగా రెండుసార్లు ప్రపంచ కప్ విజేత ఉరుగ్వేపై కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చింది. ఫస్టాఫ్?లో ఉరుగ్వే రెండు గోల్స్, కేప్ వెర్డే ఒక గోల్ సాధించాయి. ఆ జట్టు తరఫున అరావ్హో (44వ), అగస్టిన్ కానోబియో (45౦6 వ) నిమిషంలో, కేప్ వెర్డే (21 వ) గోల్స్ సాధించారు. దీంతో తొలి అర్ధ భాగం లో ఉరుగ్వే 2-1తో లీడ్?లో నిలిచింది. సెకండాఫ్?లో కేప్ వెర్డే పుంజుకున్న తీరు అద్భుతం. ఆ జట్టు హీలియో వరేలా (61 వ) నిమిషంలో గోల్ సాధించి స్కోర్లను సమం చేసింది. ఆ తర్వాత ఏ జట్టు గోల్ చేయకపోవడంతో మ్యాచ్ డ్రా అయ్యింది. ఈ మ్యాచ్?కు ముందు జరిగిన బెల్జియం-ఇరాన్ గేమ్ 0-0 తో డ్రా అయ్యింది.

## క్రికెట్ ఇప్పుడు వ్యాపారమైంది..

### క్రిస్ గేల్‌కు కీరన్ పోలార్డ్ క్షమాపణలు

వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్, యూనివర్స్ బాస్ క్రిస్ గేల్‌కు ఆ జట్టు మాజీ ఆల్‌రౌండర్ కీరన్ పోలార్డ్ క్షమాపణలు చెప్పాడు. క్రిస్ గేల్‌కు చెందిన 12 ఏళ్ల అరుదైన రికార్డ్‌ను కీరన్ పోలార్డ్ తాజాగా బద్దలు కొట్టాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఈ వరల్డ్ రికార్డ్‌తో యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్‌కు కీరన్ పోలార్డ్ క్షమాపణలు తెలియజేశాడు. అమెరికా వేదికగా జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ 2026 సిరీస్‌లో వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎంఐ న్యూయార్క్ తరఫున ఆడిన పోలార్డ్ 56 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో 81 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద.. క్రిస్ గేల్ ఆల్‌టైమ్ రికార్డ్‌ను అధిగమించాడు. 39 ఏళ్ల పోలార్డ్ ఇప్పటి వరకు 736 టీ20 మ్యాచ్‌లు ఆడి..14582 పరుగులు చేశాడు. 14,562 పరగులతో గేల్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ చారిత్రాత్మక రికార్డ్ అనంతరం మాట్లాడిన పోలార్డ్.. ఆసక్తిర వ్యాఖ్యలు చేశాడు. 'మేం ఎల్లప్పుడూ ఆదర్శంగా భావించే క్రిస్ గేల్ రికార్డ్‌ను బద్దలు కొట్టడం చాలా ప్రత్యేకమైనది. యూనివర్స్ బాస్.. నన్ను క్షమించండి. మనమిద్దం ఇప్పుడు అగ్రస్థానంలో ఉన్నాం. ఆరు లేదా ఏడో స్థానంలో బ్యాటింగ్ చేయడం చాలా కష్టం. చాలా మంది అప్‌ది ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయాలనుకుంటారు. ఎవరో ఒకరు లోయర్ ఆర్డర్‌లో వచ్చి మ్యాచ్‌ను ముగించే కష్టమైన పనిని చేయాల్సి ఉంటుంది. నేను ఆ బాధ్యతనను సవాల్‌గా స్వీకరించాను. టెక్నాలజీలానే క్రికెట్ కూడా మారుతోంది. క్రికెట్ ఇప్పుడు కేవలం ఒక ఆట మాత్రమే కాదు. అదొక వ్యాపారం. మమ్మల్ని విమర్శించిన వారందరూ ఇప్పుడు మౌనంగా మా విజయాలను ఆస్వాదిస్తారని ఆశిస్తున్నా'అని కీరన్ పోలార్డ్ చెప్పుకొచ్చాడు. పోలార్డ్, గేల్, బ్రావో వంటి ఆటగాళ్లు అంతర్జాతీయ మ్యాచ్‌ల కంటే ఫ్రాంచైజీ లీగ్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారని పలువురు మాజీ క్రికెటర్లు వారిపై అప్పట్లో విమర్శలు గుప్పించారు.

# నా గురించి జనాలకు తెలియదు: వైభవ్ సూర్యవంశీ

తాను 50 ఓవర్ల క్రికెట్‌ను చాలా ఆడానని, ఆ విషయం జనాలకు తెలియదని టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ అన్నాడు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైనా తనపై ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేశాడు. శ్రీలంక గడ్డపై ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన ఫైనల్లో వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 11 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించి ప్రపంచ రికార్డ్‌ను నమోదు చేశాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో ఇదే అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ . శ్రీలంక ఆటగాడు కుశాల్య వీర రత్నే(12 బంతులు) 20 ఏళ్ల ముందు నెలకొల్పిన రికార్డ్‌ను వైభవ్ తాజా ఇన్నింగ్స్‌తో బద్దలు కొట్టాడు. ఈ సంచలన ప్రదర్శనతో భారత్-ఏ 66 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత్-ఏ విజయంలో కీలక పాత్ర పోషించిన వైభవ్ సూర్యవంశీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా మాట్లాడిన వైభవ్ సూర్యవంశీ తనపై వచ్చిన విమర్శలపై స్పందించాడు. అలాగే ఈ సిరీస్ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నట్లు వెల్లడించాడు. 'రికార్డ్ గురించి నాకు తెలియదు. దాని గురించి ఆలోచించ లేదు. నా ప్రణాళికలను మాత్రమే అమలు చేశా. తొలి 10 ఓవర్లలో ఎలా ఆడాలనుకున్నానో అదే చేసి చూపించా. నాపై ఎలాంటి ఒత్తిడి లేదు. ఈ సిరీస్ ఆరంభంలో నేను అనుకున్న విధంగా ఆడలేదు. కోచ్‌లతో మాట్లాడి.. రిథమ్‌ను అందుకొన్నా. నా తప్పిదాలను సరిదిద్దుకున్నా. నేను 50 ఓవర్ల క్రికెట్ చాలా ఆడా. ఆ విషయం ప్రజలకు తెలియదు. విభిన్న పరిస్థితుల్లో ఎదురయ్యే సవాళ్లను తీసుకోవడం ఇష్టపడతా. ఇప్పుడు ఫైనల్లో మంచి ఇన్నింగ్స్ ఆడటం బాగుంది.'అని వైభవ్ సూర్యవంశీ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్-ఏ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 377 పరుగుల భారీ స్కోర్ చేసింది. వైభవ్ సూర్యవంశీ(29 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్స్‌లతో 94) తృటిలో శతకం చేజారగా.. తిలక్ వర్మ(90 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 67) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక-ఏ బౌలర్లలో మహమ్మద్ షిరాజ్, సహన్ అరాచిగే, దులజ్ సముదితా తలో వికెట్ తీయగా.. కుగతాస్ మతులన్, రవిందు ఫెర్నాండో, వానుజ సాహన్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం శ్రీలంక-ఏ 47.1 ఓవరల్లో 311 పరుగులకు ఆలౌటైంది. భారత్-ఏ బౌలర్లలో యశ్ ఠాకూర్(3/45), విప్రజ్ నిగమ్(3/60) మూడేసి వికెట్లు తీయగా.. అశోక్ శర్మ,తిలక్ వర్మ చెరో వికెట్ తీసారు. అనుకూల్ రాయ్(2/42) రెండు వికెట్లు దక్కాయి.

